


www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థక ఊరట

రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి ఒప్పందం

హైదరాబాద్,మే25:హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరట చేకూరింది. ఇండియన్ రైల్వే ఫెనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్‌ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో కీలక రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై సోమవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సమక్షంలో ఈ ఒప్పంద పక్రియ పూర్తయింది. హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా ఈ ఒప్పందాన్ని అధికారులు అభివర్ణించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎస్ రామకృష్ణ రావు తెలిపారు.

TUESDAY 26TH MAY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 69 COST : 3\- KHAMMAM, TELANGANA

మంగళవారం 26 మే 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 69 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



## పెరిగిన పెట్రో ధరలు

- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు

న్యూఢిల్లీ,మే25 దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ.8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర

➢ మిగతా 2వ పేజిలో..



## బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిషేధం

- అలాగే జంతు బలులు కూడా నిషిద్ధం
- అధికారులను ఆదేశించిన యూపి సిఎం యోగి

➢ 2వ పేజిలో..

# మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్ గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్,మే25 తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి

➢ మిగతా 2వ పేజిలో..

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

- పలువరికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి
- కార్యక్రమంలో ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు



న్యూఢిల్లీ,మే25 భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి

➢ మిగతా 2వ పేజిలో..



## పరస్పర అవగాహనతోటే కృష్ణా జలాల వినియోగం

- అంతర్ రాష్ట్ర సమన్వయంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- రెండు రాష్టాల్ర త్రాగునీటి అవసరాలపై కలిసి పోయే విదంగా చర్యలు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,మే25 నీటివినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల

➢ మిగతా 2వ పేజిలో..

## నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు

- గత ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకోని ఎన్‌టిఏ
- సుప్రీం ధర్మాసనం అసహనం



న్యూఢిల్లీ,మే25 దేశ వ్యాప్తం గా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా.. గత పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు

➢ మిగతా 2వ పేజిలో..

## పెట్రో ధరల పెంపు ఎవరి కోసం

కేంద్రం తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ,మే25 శంలో రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరల పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభ పడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్

➢ మిగతా 2వ పేజిలో..

## బతికుంటే సహాయం సున్నా

- చస్తే దక్కని కనీస మర్యాద
- వ్యక్తి మృతదేహాన్ని మోసుకెళ్లిన ఘటన దారుణం
- ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,మే25: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో పరిస్థితి చాలా దారుణంగా దిగజారిపోయిందని ఆరోపించారు. ఒక మృతదేహాన్ని కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బతికి ఉన్నప్పుడు సహాయం లేకపోయినా, మరణానంతరం కనీస గౌరవం కూడా దక్కని పరిస్థితికి తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకెళ్లిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఓ పోస్టు పెట్టారు. పేదల అంతిమయాత్ర కూడా గౌరవప్రదంగా సాగాలని కేసీఆర్ హయాంలో భావించి, మృతదేహాల తరలింపునకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశాయమని కేటీఆర్ గుర్తుచేశారు. అదే మానవత్వం, అదే ప్రజల గౌరవాన్ని కాపాడే పాలన అని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం కోసం కోట్ల

➢ మిగతా 2వ పేజిలో..

# పెరిగిన పెట్రో ధరలు

➤ మొదటి పేజీ తరువాయి

లీటరుకు రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ రూ.104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

# నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు

జారీ చేసింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటుచేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. ఈ అంశం గతంలోనూ సుప్రీంకోర్టును చేరింది. అప్పుడు మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేశాం. ఆ కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. మరి వాటి అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ వివరాలకు సంబంధించి గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయండని ధర్మాసనం ఎన్‌టీఏను ఆదేశించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## పెట్రో ధరల పెంపు ఎవరి కోసం

చల్లుతోందని విమర్శించారు. 2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఇది నాలుగోసారి అని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదన్నారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 5.8, 4.44, 3.90 శాతం పెరిగాయన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం భాజపా నైజమన్నారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్‌ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం భాజపా దోపిడీ భారాన్ని మోస్తోందన్నారు. దేశవ్యాప్తంగా నేడు మరోసారి భారీగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెంచాయి. పెంచిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. కాగా ఇప్పటికే మూడు విడతలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. దీంతో దిల్లీలో పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.

## బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిషేధం

లక్నో,మే25 దేశవ్యాప్తంగా బక్రీద్ వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్‌ల నిర్వహణ, జంతుబలిని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు లఖ్‌నవూలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం యోగి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు కేవలం మసీదులు, ఈద్గాహ్‌ల పరిధిలోనే జరగాలని.. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే పరిస్థితి ఉంటే షిఫ్టుల్లో నమాజ్ నిర్వహించాలని సూచించారు. అలాగే.. జంతుబలి విషయంలోనూ కఠిన నిబంధనలు అమలు చేయాలని యోగి ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ పూర్తిగా నిషేధమని, ప్రభుత్వం నిషేధించిన జంతువులను బలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కుర్బానీ అనంతరం కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సరైన పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు సీఎం యోగి. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాలు, ఈద్గాహ్‌లు, మసీదుల వద్ద అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అల్లర్లకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈద్గాహ్‌ల వద్ద పోలీస్ బలగాలు మోహరించాలని, సున్నితమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా చేపట్టాలన్నారు.

## ప్రధాని మోడీ విధానాలే దేశానికి శాపం

### మీడియా సమావేశంలో విహెచ్ విమర్శలు

హైదరాబాద్,మే25 ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని.. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పెట్రోల్ కొరత, విపరీతమైన ధరల పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు, దేశ ఆర్థిక పరిస్థితిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వీ.హెచ్ మాట్లాడుతూ.. 'దేశంలో సామాన్యుడు ఎక్కడికి వెళ్లినా పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనం. మోదీ నిర్ణయాల వల్ల ఆయన స్నేహితులు అంబానీ, అదానీ లాభపడుతున్నారు. ప్రధాని మోదీ నిరంతరం జపించే 'సబ్ కా సాత్-సబ్ కా వికాస్' అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయింది. ఆచరణలో మాత్రం అది 'అందరినీ ఇబ్బంది పెట్టే' విధానంగా మారింది. యుద్ధాన్ని ఆపేందుకు మోదీ ఎందుకు ప్రయత్నం చేయలేదు? మోదీకి ట్రంప్ ఫ్రెండ్ అని అంటారు కదా ట్రంప్‌కి చెప్పి యుద్ధాన్ని ఆపవచ్చు కదా. దేశ ఆర్థిక పరిస్థితి కుంగి పోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో ఎలా గెలవాలో తెలిసిన అమిత్ షాకి ఆర్థిక సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదా?' అని అన్నారు.

# బతికుంటే సహాయం సున్నా

రూపాయలు ఖర్చు చేసోందని.. ప్రజలకు అవసరమైన కనీస వసతులను అందించడంలో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పోస్టర్లు, సభలు, పర్యటనలు, హెలికాప్టర్ల కోసం ప్రజల డబ్బును ఖర్చు చేస్తున్నారని, కానీ పేదలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహించారు. రాజకీయ కక్షసాధింపులు, విమర్శలు, ప్రచార హోరులోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిమగ్నమైందని విమర్శించారు. ప్రజల కష్టాలు, సమస్యలు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో పాలన సాగిందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన మార్పు ఇదేనా..? అని ప్రశ్నించారు. తెలంగాణ గౌరవాన్ని వీధుల్లోకి లాగడానికే ప్రజలు ఈ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారా..? అని నిలదీశారు. నాయకుల పాదయాత్రలకు విలాసవంతమైన బస్సులు, ప్రచారాలకు ప్రభుత్వ వనరులు ఉపయోగించే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, పేదల అంతిమయాత్రకు కనీస గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటన కేవలం ఒక కుటుంబం విషాదం మాత్రమే కాదని, తెలంగాణ సమాజాన్ని కుదిపేస్తున్న పరిస్థితికి నిదర్శనమని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఓ కుటుంబం తమ బంధువు మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కండె వెంకన్న (42) వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు వెంకన్న అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తర్వాత మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేటు వాహనం ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆస్పత్రి అధికారులు మార్చురీ వ్యాన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు వేడుకున్నారు. రెండు గంటల పాటు ఎదురుచూసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చివరకు చేసేదేమీ లేక కండె వెంకన్న మృతదేహాన్ని బంధువులే భుజాలపై మోసుకుంటూ ఇంటికి తీసుకెళ్లారు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సదుపాయాలు లేక ప్రజలు ఇలాంటి ఇబ్బందులు పడటం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు..

అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని సీఎం వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామన్నారు.

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

# తమిళనాట అన్నా డీఎంకెకు ఝలక్

చెన్నై,మే25 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అన్నాడీఎంకే కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోమవారం ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఆ తర్వాత టీవీకే మంత్రి ఆదవ్ అర్జునను కలిశారు. మరగతం కుమారవేల్, జయకుమార్, సత్యభామ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు సమర్పించారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో టీవీకే ప్రభుత్వానికి.. సీవీ షణ్ముగం నేతృత్వంలో 20 మందికి పైగా అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. వారిలో ఇప్పుడు రాజీనామా చేసిన వారు కూడా ఉన్నారు. దీంతో మదురాంతకం, ధారాపురం, పెరుందురై నియోజకవర్గాలు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు మళ్లీ అక్కడ ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మాజీ సీఎం పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. వరుసగా రెండోసారి అధికారానికి దూరం కావడంతో పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. దాంతో విజయ్‌కు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీ రెండుగా చీలిన సంగతి తెలిసిందే.

## పరస్పర అవగాహనతోటే కృష్ణా జలాల వినియోగం

శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణా-కర్ణాటక రాష్ట్రల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు,సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సోమవారం రోజు భేటి అయ్యారు. భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్,నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి,శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ,రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు.కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణా సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు.సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విదంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్యన జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

### ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్ధాలు

### ఎన్సాన్‌పల్లి ఐకెపి సెంటర్ సందర్శించిన హరీష్ రావు

సిద్దిపేట,మే25 ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అరిగోస పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. యూరియా, సాగునీరు, కరెంట్ సరఫరా, పండిన పంట కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యిందన్నారు. రైతులు ఇంత బాధపడటం మొట్టమొదటి సారి చూస్తున్నామన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్లో వరి ధాన్యాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రభుత్వం ఉన్నా ఇట్లాంటి దుర్భర పరిస్థితులు ఎదురు కాలేదని చెప్పుకొచ్చారు. 'ఉత్తమ్ నీది నోరా మోరా.. మొన్న 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అని చెప్పి ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అనడం ఎంతవరకు సబబు' అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం కాదని.. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కోటి మెట్రిక్ టన్నుల ధాన్యంలో 70 లక్షలు కొంటే మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని మాజీ మంత్రి ప్రశ్నించారు. తాలు పెడితే తోలు తీస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు 5 కిలోలు తరుగు తీస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని విమర్శించారు. రోహిణి కార్తె వచ్చినా కళ్లాల్లోనే ధాన్యం, రైతులు ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నదని తెలిపారు. రైతులు గుండెలు బాదుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కళ్లు కనబడటం లేదంటూ విమర్శలు గుప్పించారు. వరి కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ÷ూష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు వదిలారని హరీశ్ రావు తెలిపారు. 'మిషన్ మోడ్‌లో వడ్లు కొనాలని రేవంత్ అంటున్నారు. నీది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్. నిన్న కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులకు ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశించారు. రైతుల ఆశలు నిరాశ అయ్యాయి. 45 రోజుల్లో మొత్తం రైతుబంధు వేస్తానని చెప్పి 60 రోజులు గడిచినా వేయలేదు. రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమే... దేవుని మీద ఒట్టు పెట్టి మాట తప్పిన రకం నువ్వు. ఢిల్లీ ట్రిప్పులు మాని.. లారీల ట్రిప్పులు పెంచు. ఒకటి, రెండు రోజుల్లో మార్పు రాకుండే స్వయంగా నేనే కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నా చేపడతా. వేలాది మంది రైతులతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌లను దిగ్బంధిస్తాం. రాజకీయ విమర్శలు మాని పరిష్కార మార్గాలు చూడండి' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# 27న మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుని, ప్రమాణ స్వీకారం

- **కామేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు..**

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 (అక్షరం న్యూస్)

ఈనెల 27 బుధవారం రోజు ఉదయం 9 గంటలకు ముచ్చర్ల గ్రామంలోని వెంకటలక్ష్మి కళ్యాణ మండపంలో కామేపల్లి మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షులు మరియు మరియు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కి మండలానికి చెందిన నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీ లో ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులకు మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చేత సన్మాన కార్యక్రమం నిర్వహించబడునని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కోరం కనకయ్య,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మరియు జిల్లా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పాల్గొంటున్నారని, కావున మండలం లోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, సర్పంచులు ఉప సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు భారీగా పాల్గొనవలసిందిగా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్ ఏపూరి మహేందర్, టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం తోటకూరి శివయ్య, ద. ని య రా క ల వానవంతరావు విలువనిచ్చారు. సోమవారం నాడు పండితాపురం గ్రామంలో జరిగిన పాత్రికేయులు సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రకటించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ, మరియు మండల అధ్యక్షుల నియామకంలో కామేపల్లి మండల అధ్యక్షుడిగా గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీగా షేక్ ఫతే మహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఆరెం రవి, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ సెక్రటరీగా సుంకరెడ్డి దామోదర రెడ్డి నియమించబడినందులకు సన్మాన సత్కార కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని,



దీనికి ముఖ్య అతిథులుగా ఎంపీ పోరిక బలరాం నాయక్, తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తదితర జిల్లా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు వెంకటేశ్వర్లు ఉప్పుగండ్ల వీరభద్రరావు, ప్రసాదు నాగేంద్రబాబు రాములు, విన్ని బాబు, వీరన్న, సాయన్న, లక్ష్మీనారాయణ భీముడు, బావ్ సింగ్ విట్టల్ రావు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## జీలుగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- **మండల వ్యవసాయ అధికారి పద్మ..**



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 25/అక్షరం న్యూస్:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల రైతులకు శుభవార్త. జీలుగ విత్తనాలు సబ్సిడీ ధరపై కేడీసీఎంఎస్ ముల్కనూర్ కేంద్రంలోని వీరాంజనేయ రైతు డిపోలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పద్మ తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల బ్యాగ్‌ను రూ. 2,460 సబ్సిడీ ధరకు రైతులకు అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకొని వచ్చి విత్తనాలను పొందవచ్చని సూచించారు. వ్యవసాయ రంగంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలను అందజేస్తోందని ఆమె తెలిపారు. జీలుగ పంట తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు ఇచ్చే అవకాశముండటంతో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కోరారు. పరిమిత నిల్వ మాత్రమే అందుబాటులో ఉన్నందున రైతులు ఆలస్యం చేయకుండా త్వరగా నమోదు చేసుకొని విత్తనాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి పద్మ విజ్ఞప్తి చేశారు.

## శిశువును పదిలంగా కాపాడుకుంటాం

- **సీడీపీఓ స్వరూప.**



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 25/అక్షరం న్యూస్:-

ప్రతి శిశువు ఆరో?యగ్యంగా, సురక్షితంగా ఎదగడానికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని భీమదేవరపల్లి మండలం సీడీపీఓ స్వరూప అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రజా పాలన 90 రోజుల కార్యక్రమంలో భాగంగా పోషకాహార మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భధారణ దశ నుంచి చిన్నారులకు ప్రాథమిక విద్య అందే వరకు అంగన్‌వాడీ కేంద్రాలు తల్లిలా సేవలు అందిస్తున్నాయని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు చిన్నారులకు సమతుల్య ఆహారం పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. తల్లి శిశువుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం అత్యంత కీలకమని వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం పోషకాహారం, పరిశుభ్రత,క్రమమైన వైద్య పరీక్షలు ఎంతో అవసరమన్నారు. గ్రామస్థుల సహకారంతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోత్స్న, సూపర్వైజర్ అనిత, ఏఎన్ఎం కళ, వార్డు సభ్యుడు అనిల్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గాంధీజీ గ్రామ సమైక్య భవనం ఎంతోమంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుంది..

- **గొల్లగూడెం గ్రామ సర్పంచ్ కోడూరు ఉమాదేవి వీర కృష్ణ**
- **గాంధీజీ గ్రామ సమైక్య భవనానికి శంకుస్థాపన చేసిన.. గొల్లగూడెం గ్రామ సర్పంచ్ కోడూరు ఉమాదేవి వీర కృష్ణ.**
- **మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్**



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 /తల్లాడ (అక్షరం న్యూస్)

తల్లాడ మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామపంచాయతీ నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గాంధీజీ గ్రామ సమైక్య భవనానికి గొల్లగూడ గ్రామ సర్పంచ్ కోడూరు ఉమాదేవి వీర కృష్ణ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా సర్పంచ్ కోడూరు ఉమాదేవి వీరకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అభ్యున్నత కోసం ఏర్పాటుచేసిన గాంధీజీ గ్రామ సమైక్య భవనం ఎంతోమంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందని, గ్రామంలో ఉన్న పలు గ్రూపు మహిళా సభ్యులందరూ కూడా భవనాన్ని వినియోగించు కోవలసినదిగా ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం :- తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కానుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ, మహిళలను మరింత అభివృద్ధి పథంలో తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి బీసీ సెల్ అధ్యక్షులు కోడూరు వీర కృష్ణ, సెక్రెటరీ కవిత, సీసీ భద్రమ్మ, ఉపసర్పంచ్ తోటపల్లి నాగలక్ష్మి, వార్డు మెంబర్లు కోడూరు దుర్గారావు, నాయకులు కాపా వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఇలా సాగరపు వెంకటేశ్వరరావు, ఇలా సాగరపు శ్రీనివాసరావు, కాపా చిన్న రామారావు,కాపా మహేష్ బాబు, కాపా నరసింహారావు, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు ఇస్నేపల్లి అశోక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇశ్నేపల్లి వీరయ్య, పగిడిపల్లి పెద్ద గోపయ్య, సాదా మల్లయ్య, బొగ్గుల పుల్లారెడ్డి,బొడ్డు కృష్ణ,గుండ్ల బాలకృష్ణ, కోడూరు సత్యం,తోటపల్లి కృష్ణ, గొల్లమందల అంజి, ఇశ్నేపల్లి దేవదానం, ఇశ్నేపల్లి తిరుపతిరావు, ఈవో అధ్యక్షులు ఇశ్నేపల్లి సుశీల, గొల్లమందల దేవకరణ, తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల భవనాలకు శంకుస్థాపన చేసినరెడ్డిగూడెం సర్పంచ్ మోదుగు తిరుమలరావు ,ఉప సర్పంచ్ పైడిపల్లి జగన్ మోహన్ రావు



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 /తల్లాడ (అక్షరం న్యూస్)

స్వయం సహాయక సంఘాల భవనాలకు కొడవడమెట్ట గ్రామంలో శంకుస్థాపన కార్యక్రమాలను సర్పంచ్ మోదుగు తిరుమలరావు,ఉప సర్పంచ్ పైడిపల్లి జగన్ మోహన్ రావు చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు... ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం చేపట్టాలనే నిర్ణయంతో సోమవారం నాలుగు గంటలకు గ్రామ సంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి రవి, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, ఏపిఎం రవికుమార్ , ఏఈ కార్తీక్ , వివో అధ్యక్షులు సైదా , మాజీ సర్పంచ్ వంశీ , ఎఫ్ ఓ కృష్ణారావు ,సిసి , దూల సురేష్ , గ్రామ సమైక్య మహిళలు, గ్రామ ప్రజలు వివోలు, గ్రామ పెద్దలు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ స్వయం సహాయక సంఘ భవనానికి శంకుస్థాపన చేసిన మల్లారం సర్పంచ్ కటిక కిరణ్ కుమార్ ఉప సర్పంచ్ యశోద



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 తల్లాడ (అక్షరం న్యూస్)

ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత చేర్చటం కొరకు స్వయం సహాయక సంఘాల భవనానికి మల్లారం గ్రామంలో సర్పంచ్ కటిక కిరణ్ కుమార్, ఉపసర్పంచ్ ధారావత్ యశోద చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిరణ్ మాట్లాడుతూప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం చేపట్టాలనే దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆయా పంచాయతీలలో గ్రామ సంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పిలుపు మేరకు గ్రామంలో పండుగ వాతావరణంలో శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్ కె సిద్ధిక్ మియా, ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ ఎర్రి నరసింహారావు, ఏపిఎం రవికుమార్, సీసీ మాధవి, తోట మురళి, మల్లవరం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు దుగ్గిదేవర సీతారామయ్య, జగన్, ఉపేందర్,తల్లాడ మండల ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్యా అంజయ్య,వార్డ్ మెంబర్లు, గ్రామ దీపికలు గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## శాలువాలకు బదులుగా మొక్కలు ఇవ్వండి..

- **పర్యావరణ పరిరక్షణలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదర్శంగా నిలవాలి ..**
- **కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్**
- **జిల్లా కోఆర్డినేటర్ మామిడి శంకర్**



సూర్యాపేట మే 25(అక్షరం న్యూస్ ):

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని పర్యావరణ ప్రేమికులు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ జిల్లా కోఆర్డినేటర్ మామిడి శంకర్ అన్నారు. ఈ నేపథ్యంలో సభలు, సమావేశాలు, ప్రారంభోత్సవాలు, సన్మాన కార్యక్రమాల్లో శాలువాలు, పూలదండలు, ఖరీదైన జ్ఞాపికలకు బదులుగా మొక్కలను అందించి సన్మానించే సంస్కృతి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, అడవుల నరికివేత వంటి సమస్యలు భవిష్యత్తులో తీవ్రమైన పర్యావరణ సంక్షోభానికి దారి తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెట్లు మనిషికి ప్రాణవాయువు అందించడమే కాకుండా వర్షాలను కురిపించి ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇటీవల అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో శాలువాలు, పూలదండలతో సన్మానాలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని, అయితే వాటి స్థానంలో ఒక మొక్కను అందిస్తే అది పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. ఒక మొక్కను బహుమతిగా ఇవ్వడం ద్వారా ఆ మొక్క పెరిగి భవిష్యత్ తరాలకు నీడ, ప్రాణవాయువు, పండ్లు, ప్రకృతి సంపదను అందిస్తుందని వివరించారు. ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి అధికారి తమ కార్యక్రమాల్లో మొక్కల పంపిణీని తప్పనిసరిగా అమలు చేస్తే పచ్చదనం పెరుగుతుందని, ప్రజల్లో కూడా ప్రకృతి పరిరక్షణపై చైతన్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. గ్రామాలు, పట్టణాలు పచ్చదనంతో కళకళలాడాలంటే ఇలాంటి చిన్నచిన్న మార్పులే పెద్ద ఫలితాలను ఇస్తాయని అన్నారు. “శాలువా కంటే మొక్క గొప్పది... మొక్క నాటితేనే భవిష్యత్తు భద్రం”అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పర్యావరణ ప్రేమికులు మామిడి శంకర్ పిలుపునిచ్చారు.

## గాంధీజీ గ్రామ సమైక్య భవనానికి శంకుస్థాపన చేసిన తెలగవరం గ్రామ సర్పంచ్ భూక్యా కాళోజీ..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 తల్లాడ (అక్షరం న్యూస్)

తల్లాడ మండల పరిధిలోని తెలగవరం గ్రామపంచాయతీ నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గాంధీజీ గ్రామ సమైక్య భవనానికి తెలగవరం గ్రామ సర్పంచ్ భూక్యా కాళోజీ. ఉపాసర్పంచ్ నరసింహారావు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా సర్పంచ్ కాళోజీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అభ్యున్నత కోసం ఏర్పాటుచేసిన గాంధీజీ గ్రామ సమైక్య భవనం ఎంతోమంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందని, గ్రామంలో ఉన్న పలు గ్రూపు మహిళా సభ్యులందరూ కూడా భవనాన్ని వినియోగించుకోవలసినదిగా ఈ సందర్భంగా తెలియజేశారుఈ సందర్భంగా తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము నరసింహారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ, మహిళలను మరింత అభివృద్ధి పథంలో తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శ్రీనివాస్ ,సీసీ విజయలక్ష్మి. అనంతయ్య. వెంకటేశ్వరరావు. నాగు. సీతయ్య. ఏసుపాదం. అప్పారావు. మరియు గ్రూప్ మహిళలు వార్డు మెంబర్లు. తల్లాడ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వారాల అజయ్. తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు "ఇందిరా మహిళా శక్తి" తో కొత్త దిశ..

- 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్లమ్ స్థాయి సమాఖ్యలు, పట్టణ సమాఖ్యల సర్వసభ సమావేశాలు ఘనంగా నిర్వహణ..



సూర్యాపేట మే 25(అక్షరం న్యూస్ ):

మున్సిపాలిటీ పరిధిలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక -- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్లమ్ స్థాయి సమాఖ్యలు మరియు పట్టణ సమాఖ్యల సర్వసభ సమావేశాలు మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోమవారం 24వ వార్డు లో వార్డు కౌన్సిలర్ మన్నెం అరుణ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాల్లో మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత, మెప్మా పిడి హనుమత్ రెడ్డి లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక భద్రత మరియు సాధికారత లక్ష్యంగా "ఇందిరా మహిళా శక్తి" పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల్లో లేని పేద, నిరుపేద మహిళలను గుర్తించి కొత్తగా పొదుపు సంఘాలు ఏర్పాటు చేయడం, వారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించడం, స్వయం ఉపాధి అవకాశాలు అందించడం ద్వారా వారి జీవనోపాధులను మెరుగుపరచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు.స్లమ్ స్థాయి సమాఖ్యలు, పట్టణ సమాఖ్యలు, స్త్రీ నిధి వడ్డీ లేని రుణాలు మరియు ఇతర ఆర్థిక సహాయ పథకాల ద్వారా మహిళలు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో డి యం సి రమేష్ నాయక్, శ్వేత, సువర్ణ,జిల్లా కోఆర్డినేటర్లు , మున్సిపల్ అధికారులు మరియు ఆర్ పి లు షభానా, యశోద , నాగరాణి,మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గంగా-జమునా తెహజీబ్‌ను కాపాడుకుందాం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పరస్పర సహకారంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టిందని తెలిపారు. రామగుండం పోలీస్ స్టేషన్‌లో రామగుండం సీఐ కృష్ణ ఆధ్వర్యంలో,ఎస్సై సంధ్యారాణి సమన్వయంతో ముస్లిం,హిందూ, క్రిస్టియన్ మత పెద్దలతో శాంతి సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో గంగా-జమునా తెహజీబ్ (మత సామరస్యం) ఎప్పటి నుంచో కొనసాగుతోందని, అన్ని మతాల ప్రజలు కలిసి మెలిసి జీవిస్తున్నారని తెలిపారు.సెల్‌ఫోన్ వినియోగం పెరగడంతో కుటుంబ బంధాలు దూరమవుతున్నాయని,యువత సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నిజానిజాలు తెలుసుకోకుండా ఫార్వర్డ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బక్రీద్ పండుగ శాంతి, సహనం,పరస్పర గౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ,జిల్లాలో అన్ని పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవడం ఆనందకరమని తెలిపారు.రోజుకు కనీసం పది నిమిషాలైనా కుటుంబ సభ్యులతో గడపాలని,సెల్‌ఫోన్ల కారణంగా ఒకరికొకరు దూరం కాకూడదని సూచించారు. సమాజంలో శాంతి, సామరస్య వాతావరణాన్ని కొనసాగించేందుకు అందరూ సహకరించాలని కోరారు.ఎక్కడైనా అనుమానాస్పద వాహనాలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.పండుగ నేపథ్యంలో ఎలాంటి అపోహలు, వదంతులు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని,వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని తెలిపారు.ప్రభుత్వం అనుమతించిన నిర్ణీత ప్రదేశాల్లోనే జంతువధ (ఖుర్బానీ) నిర్వహించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో జంతు అవశేషాలను పారవేయకుండా పరిశుభ్రత పాటిస్తూ మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే డయల్-100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఏవైనా సమస్యలు ఉంటే పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ సమావేశంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ కృష్ణ,ఎస్సై సంధ్యారాణి, హిందూ,ముస్లిం,క్రిస్టియన్ మత పెద్దలు పాల్గొన్నారు.



# ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి...

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- వచ్చే వర్షాకాలానికే బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు చేరాలి..
- డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణలో రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి..
- యాతాలకుంట టన్నెల్ ను పరిశీలించిన మంత్రి తుమ్మల..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 (అక్షరం న్యూస్)

ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్ ను సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు దివాకర్ టిఎస్, అంకిత్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లను వెంట తీసుకొని మంత్రి స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ టన్నెల్ లోపలికి వెళ్లి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడం ఇక్కడి ప్రజల చిరకాల స్వప్నమని అన్నారు. ఏటూరునాగారం నుంచి పాపికొండల వరకు గోదావరి పరివాహక ప్రాంతం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఆ జలాలను వినియోగించు కోలేకపోయామని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఖమ్మం సరిహద్దుల వరకు వచ్చినా సిల్ట్ సమస్యలు, ఇతర ప్రాంతాల ఆయకట్టు కారణంగా జిల్లాకు నీరు అందలేదని అన్నారు.నాగార్జునసాగర్ ఎడమ కాలువ కొంత మేర ఉపశమనం ఇచ్చినా, ఖమ్మం జిల్లా ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో గోదావరి జలాలను వినియోగించుకోవాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ మాత్రమే మార్గమని తెలిపారు. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రతి ముఖ్యమంత్రిని ఖమ్మం జిల్లాకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని కోరుతూ పోరాడానని పేర్కొన్నారు.1997-98లో నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం రైట్ లైన్ కెనాల్ వరకు లిఫ్ట్ పనులను రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేశామని, అదే సమయంలో దేవాదుల, దుమ్ముగూడెం లిఫ్ట్ ప్రాజెక్టులను ప్రతిపాదించామని తెలిపారు. నిధుల కొరత కారణంగా అప్పట్లో దేవాదుల ప్రాజెక్ట్ మాత్రమే ప్రారంభమైందన్నారు. వైఎస్సార్ హయాంలో దుమ్ముగూడెం ప్రాజెక్టును ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ పేర్లతో తీసుకువచ్చారని, రాష్ట్ర విభజన అనంతరం ఇందిరాసాగర్ హెడ్‌వర్క్స్ ఆంధ్రప్రదేశ్కు వెళ్లిపోవడంతో పాటు అవసరమైన అనుమతులు కూడా లేకపోవడంతో ప్రాజెక్ట్ ముందుకు సాగలేదని అన్నారు.రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి దుమ్ముగూడెం ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చామని, ఈ ప్రాంతానికి శ్రీ సీతారాములతో ఉన్న అనుబంధం కారణంగా దీనికి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని పేరు పెట్టామని తెలిపారు.2016లో 13 వేల కోట్ల పరిపాలనా అనుమతులు వచ్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో పనులు చాలా నెమ్మదిగా సాగాయని అన్నారు. 100 కిలోమీటర్ల ప్రధాన కాలువ, మూడు పంప్ హౌస్‌లు మాత్రమే పూర్తయ్యాయని, ప్రస్తుతం నాలుగో పంప్ హౌస్ పనులు కొనసాగు తున్నాయని, వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. సత్తుపల్లి ట్రంక్‌లో భాగమైన యాతాలకుంట టన్నెల్ ద్వారానే ప్రధాన కాలువ నుంచి నీరు సరఫరా అవుతుందని వివరించారు.గత ప్రభుత్వం టన్నెల్ నిర్మించాలా, పైపులైన్ వేయాలా అనే విషయంలో నిర్ణయం తీసుకోలేదని, భద్రాచలం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకువచ్చి పెండింగ్ పనులను ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై 10 వేల కోట్లు ఖర్చు చేశామని, మరో 7 నుంచి 8 వేల కోట్లు వెచ్చిస్తే కాలువల పనులు పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.రాజీవ్ లింక్ కాలువను ఆరు నెలల్లో పూర్తి చేశామని, వచ్చే జూన్ నాటికి గోదావరి జలాలతో వైరా ప్రాజెక్టును నింపి లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. యాతాలకుంట టన్నెల్ పూర్తైతే మరో లక్ష ఎకరాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు.యాతాలకుంట టన్నెల్ పనులు 16 నెలల క్రితం ప్రారంభమై, ఏజెన్సీ అధికారులు రాత్రింబవళ్లు కష్టపడి టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేశారని అభినందించారు. టన్నెల్ లైనింగ్ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని, రెండు వైపులా పనులు వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే వర్షాకాలానికే యాతాలకుంట టన్నెల్ ద్వారా గోదావరి జలాలు బేతుపల్లి చెరువుకు చేరాలనేది తన కోరిక అని అన్నారు.ప్రధాన కాలువ భూసేకరణ పూర్తి చేసిన కలెక్టర్ లకు మంత్రి అభినందనలు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల కోసం ఇంకా 11వేల ఎకరాల భూమి అవసరం వుందని, భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గత ప్రభుత్వం డిస్ట్రిబ్యూటరీ కాలువలను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపిందని తెలిపారు.మొదట పినపాక, తరువాత కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఈ ఏడాదిలోనే ప్రయోజనం చేకూరుతుందని, కాలువల పనులు త్వరగా పూర్తవ్వాలంటే ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు రైతులతో సమన్వయం చేసి భూసేకరణకు సహకరించాలని కోరారు.లియాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులు ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే ఎమ్మెల్యేలు, కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని ఏజెన్సీకి సూచించారు.లి భూమి ఇచ్చిన రైతులకు మంచి పరిహారం అందిస్తున్నామని, ప్రాజెక్ట్ కోసం రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మొత్తం 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, జూలూరుపాడు టన్నెల్ పూర్తైతే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని, ఖమ్మం జిల్లాలో మొత్తం 10 లక్షల ఎకరాలు సాగునీటి పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు.జూలూరుపాడు టన్నెల్ టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, యాతాలకుంట టన్నెల్ లైనింగ్ అనంతరం జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం అవుతాయని అన్నారు. భూసేకరణ సమస్యలను త్వరగా పరిష్కరించి పనులు పూర్తి చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు స్థానిక ఎమ్మెల్యేలు, రైతుల సహకారంపైనే ఆధారపడి ఉన్నాయని చెప్పారు.గోదావరి జలాలు అందితే ఆయిల్‌పామ్ సాగు విస్తృతంగా పెరుగుతుందని, రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని మంత్రి తెలిపారు. ఉద్యాన పంటలకు తక్కువ నీరు సరిపోతుందని, ఒక ఎకరం వరి సాగు నీటితో ఐదు ఎకరాల ఆయిల్‌పామ్ సాగు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వరి సాగులో ఎరువులు, మార్కెటింగ్, అకాల వర్షాలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు.దేశంలో ప్రతి పంటను కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని, వరి, మొక్కజొన్న, జొన్నలు, సన్‌ఫ్లవర్ వంటి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నా యని విమర్శించారు. డీజిల్ సరఫరా, హమాలీల కొరత, గన్నీ బ్యాగుల సరఫరా తగ్గినా తెలంగాణ దేశంలో అత్యధిక ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా నిలిచిందన్నారు.కేంద్ర ప్రభుత్వం కేవలం కనీస మద్దతు ధర ప్రకటిస్తోందే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతుల సమస్యలను రాజకీయాలకు ఉపయోగించు కోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వసుంధర, ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# బెలిదే శ్రీనివాసును అత్యధిక ఓట్లతో గెలిపించాలి..

- మున్సిపల్ చైర్ పర్సన్ నివేదిత లక్షాధి

సూర్యాపేట మే 25(అక్షరం న్యూస్ )

పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా పోటీ చేస్తున్న బెలిదే శ్రీనివాసును అత్యధిక ఓట్లతో గెలిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. ఆదివారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రం రవి మహల్ లో బెలిదే శ్రీనివాసులు మద్దతుగా ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో బెలిదె శ్రీనివాసులు యొక్క ఎన్నికల మేనిఫెస్టో ను మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేద మద్యతరగతి , ఆర్యవైశ్యుల కోసం , విద్యార్దులు, మహిళల కోసం అనేక పథకాలు ప్రకటించారని అన్నారు. ఈ మేనిఫెస్టో అమలు కావడానికి బెలిదె శ్రీనివాసులు కు ప్రతి ఒక్కరూ ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్వంత స్థలం వున్న ఆర్యవైశ్యులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బెలిదె శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి కట్టుబడి వున్నానని తెలిపారు. సూర్యాపేట పట్టణంలో ఆర్యవైశ్యుల కోసం కర్మకాండ భవనం నిర్మాణం, అంబులెన్స్ సౌకర్యం, పేద కుటుంబాల వివాహాలకు సహాయం, ఉచిత ఫ్రీజర్ బాక్స్, మహిళలకు బోటిక్, కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు వంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.పేద విద్యార్థులకు విద్యా సహాయం, ప్రతిభ కనబరిచిన వారికి సన్మానం, వ్యాపారులకు రుణ సదుపాయం, మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల బరిలో నిలిచిన మిట్టపల్లి రమేష్ స్నేహ పూర్వక పోటీలో భాగంగా బెలిదె శ్రీనివాసులు కు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల సత్యనారాయణ, మొరిశెట్టి కోటేశ్వరరావు, మిట్టపల్లి రమేష్, ఉప్పల శ్రవణ్, రాచకొండ శ్రీనివాస్, చల్లా లక్ష్మి ప్రసాద్, బిక్కుమల్ల కృష్ణ, గుండా వెంకన్న, బొల్లం సురేష్, బోనగిరి కృష్ణ, సోమ వెంకన్న, సోమ ప్రవీణ్ కుమార్, కర్నాటి సురేందర్, ఈగ వెంకటేశ్వర్లు, పోలా రాధాకృష్ణ, కందిబండ ఉమ మహేశ్వరరావు, పెద్దసంఖ్యలో వ్యాపారులు, మహిళలు పాల్గొన్నారు.



## గ్రామీణ మహిళల సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది..

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 (అక్షరం న్యూస్)

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు గ్రామీణ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించిన సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గుండుగులపల్లి గ్రామంలో గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఆర్థికంగా సామాజికంగా మరింత బలపడేందుకు మహిళా సమాఖ్య భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు మహిళా సంఘాల సమావేశాలు స్వయం ఉపాధి కార్యక్రమాలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ భవనాలు అభివృద్ధి కేంద్రాలుగా మారనున్నాయని చెప్పారు. గ్రామీణ మహిళలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని వెల్లడించారు.అదేవిధంగా ఎమ్మెల్యే సూచనల మేరకు అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య భవనాల శంకుస్థాపన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి గ్రామాభివృద్ధి మహిళా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు కనీస వసతులు కరువు

- ఎండల్లో అవస్థలు పడుతున్న కార్మికులు.




హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 25/అక్షరం న్యూస్–:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలు కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో కూలీలు మండుటెండల్లో ఇబ్బందులు పడుతున్నారు.ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో పనుల ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఎక్కడా అలాంటి సదుపాయాలు కనిపించడం లేదని కూలీలు వాపోతున్నారు. తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకుని దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.ఉపాధి పనుల వద్ద అధికారులు కేవలం ఫోటోలు తీసుకోవడానికే పరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ స్థానిక స్థాయిలో అమలు లోపిస్తున్నదని విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనుల ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, ప్రథమ చికిత్స కిట్లు వంటి కనీస వసతులు కల్పించి ఉపాధి కూలీల ఇబ్బందులు తీర్చాలని కార్మికులు కోరుతున్నారు.

## ప్రభుత్వం ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలి

- తెలంగాణరైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపశ్యం పద్మ

జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) మే 25 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వి ఎ సి ఎ స్ , ఐ కె వి ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లా అధికారులు, సివిల్ సప్లై అధికారులు తత్సరం చేయడం వల్ల రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సిపిఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మ అన్నారు. సోమవారం మండలంలోని కంచనపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి తో కలిసి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ చూసినా సరియైన రవాణా సౌకర్యం లేక వందలాది బస్తాలు కుప్పలుగా పెట్టి ఉన్నాయాని, రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి ఎందుకు అర్థం కావడం లేదని ఆమె మండి పడ్డారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మూడు రోజుల్లో కొనుగోలు పూర్తి చేయకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున మహా ధర్నా కార్యక్ర మాన్ని నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు.ఇట్టి సందర్శనలో సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, సోమయ్య, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కావటి యాదగిరి, హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ, నాయకులు కందుకూరు మల్లేష్, ప్రవీణ్,గుండె సుధాకర్, నాల్కపల్లి దావీదు, పసుల దానియేలు,రైతులు పాల్గొన్నారు.



# మహిళలే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలు.....

- సీఎం రేవంత్ రెడ్డి
- ఒకేసారి 8 వేల మహిళా సంఘ భవనాలకు వర్చువల్ గా శంకుస్థాపన..
- మహిళా సంఘాల ద్వారా రైస్ మిల్లులు,
- లాజిస్టిక్ పార్కుల ఏర్పాటు..
- మహిళలను బస్సుల యజమానులుగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం..
- సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి....
- మహిళలు ముందుండాలి.
- మహిళా సంఘ భవనాల శంకుస్థాపన,
- ఇందిరమ్మ చీరల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 (అక్షరం న్యూస్)

మహిళలే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మూల స్తంభాలని, మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడంతో పాటు మహిళల కోసం రూపొందించిన నూతన డిజైన్ ఇందిరమ్మ చీరలను ఆవిష్కరించారు.సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో పాటు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, జిల్లా మహిళా సంఘాల ప్రతినిధులు ఖమ్మం కలెక్టరేట్ నుండి వర్చువల్ గా పాల్గొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు నిర్వహించే వ్యాపారాలు సొంత భవనాల నుంచి సాగేందుకు ప్రభుత్వం అద్భుత కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఒకేసారి 8 వేల మహిళా సంఘ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మంత్రి సీతక్కకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని భావించిన ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని అన్నారు.మహిళలను బస్సుల యజమానులుగా తీర్చిదిద్దే దిశగా మహిళా సంఘాల ద్వారా వెయ్యి బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి నడుపుతున్నామని తెలిపారు. తొలి విడతగా 500కు పైగా బస్సులను పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, రిలయన్స్ వంటి సంస్థలతో సమన్వయం చేసుకుంటూ మహిళలకు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలే కాకుండా వ్యాపార నైపుణ్యాలు అందించేందుకు వీ–హబ్ ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు సీఎం తెలిపారు. భవిష్యత్తులో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించి రైస్ మిల్లులు, పెద్ద గోదాములు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. మహిళా సంఘాలు సేంద్రియ వ్యవసాయం, సహజ వ్యవసాయ ఉత్పత్తుల ప్రోత్సాహంలో కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. మహిళలు పంట మార్పిడి విధానంపై కూడా విస్తృత అవగాహన కల్పించాలని సీఎం మహిళలకు, అధికారులకు సూచించారు.ఖమ్మం రైతులు మంచి అభ్యున్నతితో ఉన్నారని, కూరగాయలు, పండ్లు, ఆయిల్ పామ్ వంటి కమర్షియల్ పంటల వైపు మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు.ఇందిరమ్మ చీరలను మహిళలు ఆదరిస్తుండడం సంతోషకరమని, వచ్చే ఏడాది మహిళలకు నూతన డిజైన్ చీరలను అందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో వి.ఓ భవనాలను నిర్మిస్తున్నామని తెలపగా, డిసెంబర్ 9 లోపు వి.ఓ భవనాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సిరివెన్నెల ఎఫ్.పి.ఓ కృష్ణవేణి, ఖమ్మం జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు కొట్టే విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మహిళా సంఘ భవనాల నిర్మాణం కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల్లో మహిళలు ముందుండి పాల్గొంటున్నారని తెలిపారు. ఇందిరా మహిళా డైరీ, పెట్రోల్ బంక్‌లు, మహిళా మార్ట్‌లు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు వంటి అనేక కార్యక్రమాలను మహిళల కోసం అమలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు ప్రత్యేకంగా భవనాలు కేటాయిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృష్ణవేణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీరామ్, సంబంధిత అధికారులు, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## ఎండాకాలం వడదెబ్బ బాధితుల కోసం

# గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు..

- నియర్ మహంకాళి స్వామి

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

వడ దెబ్బ బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది సదా సిద్దంగా ఉండాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. ఇటీవల ఎండల తీవ్రత తో వడ దెబ్బ బారిన పడి ప్రజలు అస్వస్థత గురవడం , వరుస మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో మేయర్ సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వడ దెబ్బ బాధితులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వార్డులలో తిరుగుతూ రోగులతో మాట్లాడి అనంతరం వైద్యులతో సమీక్షించారు.ఈ సంధర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వైద్యులు ఉదయం 10 గం . నుండి 12 గం వరకు మాత్రమే ఆసుపత్రిలో ఉంటున్నారని , వివిధ విభాగాల అధిపతులు అందుబాటులో ఉండడం లేదని రోగులు ఫిర్యాదు చేశారు . నీటిని శుద్ధి చేసే యంత్రాలు , చాలా చోట్ల ఫ్యాన్లు , కూలర్లు పని చేయడం లేదని , ఐ సి యు , అత్యవసర వార్డులలో లో ఎ సి లు పని చేయడం లేదని తెలిపారు . కాగా కొత్తగా 10 కూలర్లు , 20 ఫ్యాన్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. వడ దెబ్బ ప్రభావాన్ని తగ్గించడానికి స్ప్రింక్లర్ లు లేవని అన్నారు. ఎం ఆర్ ఐ స్కానింగ్ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కొన్ని రకాల మందులు ప్రభుత్వం నుండి సరఫరా కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయట కొనుక్కోవాలని సూచిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మేయర్ స్పందిస్తూ వైద్య సేవలు మెరుగుపరచడానికి ఆసుపత్రికి అవసరమైన వాటి గురించి లిఖిత పూర్వకంగా ఇస్తే ఎం ఎల్ ఎ , జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మునిసిపల్ కార్పొరేషన్ నుండి అందించవల్సిన సేవలను తప్పనిసరిగా ఇస్తామని అన్నారు. ఆసుపత్రిలో అత్యవసరమైన చోట టవర్ ఎ సి లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు.ఎండల కారణంగా నగరంలో పరిస్థితి తీవ్రంగా ఉన్న దృష్ట్యా ఆసుపత్రిలో అన్ని వేళలా వైద్యులు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఎక్కువ మంది వైద్యులు గైర్హాజరు అవుతున్నవిషయం ఈ రోజు తన సందర్శనలో ప్రత్యక్షంగా గమనించానని అది పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఫోన్ కాల్స్ కు వైద్యులు స్పందించాలని అన్నారు. ప్రైవేట్ ప్రాక్టీస్ కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అందించే వైద్య సేవలపై దృష్టి సారించాలని అన్నారు. వడ దెబ్బ నుంచి ఉపశమనం కల్గించే ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఆసుపత్రి తో పాటు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక ఎ సి గదులు , అంబులెన్స్ అందుబాటులో ఉండాలని అన్నారు. వార్డులలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంధర్భంగా కార్పొరేటర్ ముస్తాఫా, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ ఎం ఓ రాజు , వైద్యులు అశోక్ , అజయ్ , స్వప్న లత తదితరులు ఉన్నారు.



## ఎండ తీవ్రత దృష్ట్యా మున్సిపల్ కార్మికుల పని వేళలు మార్పు

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎండ తీవ్రత దృష్ట్యా కార్మికుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య కార్మికుల పని వేళలు సవరిస్తున్నట్లు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు . ఎండ బారిన పడకుండా నగర పాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 11 గంటల కల్లా విధులు ముగించాలని అన్నారు. ఇటీవల వడ దెబ్బ బారిన పడి ప్రజలు అస్వస్థత గురవడం , వరుస మరణాలు సంభవిస్తుండడంతో ఎం .ఎల్ .ఎ . ఎం ఎస్ రాజ్ ఠాకూర్ పరిస్థితి సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు , పారిశుద్ధ్య విభాగానికి సంబందించిన సిబ్బంది అందరూ ఉదయం 4.00 గంటలకు విధులకు హాజరై ఉదయం 11 .00 గంటలకు విధులు ముగించుకొని ఇంటికి వెళ్లిపోవాలని సూచించారు . విధి నిర్వహణలో ఉన్నప్పుడు కూడా వడ దెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలనిఅన్నారు. ఎండ తీవ్రత తగ్గేంత వరకు ఈ పని వేళలు అమల్లో ఉంటాయని అన్నారు.

## నేడు ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎన్నికలు

- **కార్యదర్శి పదవికి ఇద్దరు పోటీ**

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్‌టీపీసీ రామగుండం ఀ తెలంగాణ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎన్నికలు మంగళవారం జరుగుతున్నాయి. ప్రధాన కార్యదర్శి కి మినహా మిగతా పదవులన్నీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ప్రధాన కార్యదర్శి (జనరల్ సెక్రటరీ) పదవికి బి. శ్రీరామ్, విభవ్ రస్తోగి మధ్య పోటీ నెలకొనడంతో ఇద్దరు అభ్యర్థులు తమ ప్రచార కార్యక్రమాలను పూర్తి చేశారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్‌టీపీసీ స్టేడియం వద్ద పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 490కి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.ఇప్పటికే పలువురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషంగా మారింది. వైస్ ప్రెసిడెంట్ పదవికి దినబంధు పాల్ ఎటువంటి పోటీ లేకుండా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా సతీష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవులకు రవి కర్ణ్, ఎస్.కె. సమాల్, సుజన్ మాణిక్ సింగ్‌లు కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.ప్రధాన కార్యదర్శి పదవికే ఎన్నిక జరగనుండటంతో ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. స్పోర్ట్స్ కార్యకలాపాల అభివృద్ధికి కొత్త కమిటీ కీలకంగా పనిచేస్తుందనే అభిప్రాయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

## మల్కాపూర్ శివారు లోని అగ్నికి కాళీ పోయిన పామాయిల్ తోటలను సందర్శించిన ఉద్యాన వ్యవసాయ అధికారులు



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

మల్కాపూర్ శివారులోని వ్యవసాయ పొలాల్లోని పామాయిల్ తోటలను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టిచిన పామాయిల్ తోటలను మండల వ్యవసాయ అధికారి ప్రకాష్ , ఉద్యాన విస్తరణ అధికారి రాము లు సందర్శించి కాళీ పోయియినా పామాయిల్ చెట్లని, బిందు సేద్య పరికరాలు, పైపులు దరిదాపుగా పూర్తిగా దగ్ధమాయ్యాయని వారు తెలిపారు. మొత్తం ఏడుగురు రైతులకు చెందిన సుమారు 10 ఎకరాల పామాయిల్ తోటలకి సంబందించిన డ్రిప్ సేద్య పరికరాలు దగ్ధ మాయ్యాయని పై అధికారులకు నివేదిక సమర్పించడమైనది. వారి తో పాటు తిరుమల కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, రైతులు, రాం రెడ్డి,మణెమ్మ, మామిడాల రాము, నారాయణ, కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు.

## మేడిపల్లి సహకార సంఘంలో 50% సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం మండల రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. భూసారాన్ని పెంపొందించడం, సేంద్రియ సాగును ప్రోత్సహించడం లక్ష్యంగా వానాకాలం--2026 సీజన్‌కు పచ్చిరొట్ట ఎరువు పంటల విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి కే. ప్రకాష్ తెలిపారు.మేడిపల్లి సహకార సంఘంలో ప్రస్తుతం జీలుగ పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 30 కిలోల విత్తనాల మొత్తం ధర రూ.4,905 కాగా, ప్రభుత్వ సబ్సిడీ అనంతరం రైతులు కేవలం రూ.2,453 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు.రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నంబర్‌తో మేడిపల్లి సహకార సంఘాన్ని సంప్రదించి సబ్సిడీ విత్తనాలను పొందవచ్చున్నారు.పచ్చిరొట్ట పంటల సాగు ద్వారా భూమిలో సేంద్రియ పదార్థం పెరిగి నేల సారవంతం అవుతుందని, తద్వారా తదుపరి పంటలకు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారి కే. ప్రకాష్ వివరించారు. రామగుండం మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## స్వర్గీయ ప్రొఫెసర్ తిరకాల మల్లేష్ గౌడ్ 5వ వర్ధంతి సందర్భంగా అన్నదానం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టిపిసి లోని శ్రీ హర్షిత ఎంటర్ప్రైజెస్ ప్రొఫెసర్ స్వర్గీయ తిరకాల మల్లేష్ గౌడ్ ఐదవ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్ లో కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 32 వ డివిజన్ కార్పొరేటర్ తోట మమత కుమారస్వామి, మిట్టపల్లి అనిల్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడం ద్వారా మహనీయుల జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలబెట్టవచ్చని పేర్కొన్నారు. తిరకాల మల్లేష్ గౌడ్ సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు చేపట్టిన అన్నదాన కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తిరకాల రాజేశ్వరి, హర్షిత, హారిక, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం రైల్వేస్టేషన్లో ప్రయాణికుల కోసం ఉచితంగా మజ్జిగ పంపిణీ




జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం రైల్వేస్టేషన్లో ప్రయాణికుల కొరకు సోమవారం రైల్వే స్టేషన్లో మజ్జిగ అనుమాస శ్రీనివాస్ జీన్స్ రైల్వే డివిజనల్ మెంబర్. ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎండ తీవ్రంగా ఉండడం వలన స్థానికులు ఇబ్బందికి గురి అవుతున్నారు. ఈ విషయాన్ని గమనించి శ్రీనివాస్ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఎండి రహీం శేఖర్ రజాక్ తిడగొట్టి లక్ష్మణ్ కసనబోయిన రమేష్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కొమిరే గ్రామంలో వృద్ధురాలు నేత్రదానం

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొమిరె గ్రామంలో మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొత్తిరెడ్డి లక్ష్మి(82) అనారోగ్యంతో మృతి చెందినప్పటికీ, ఆమె కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో నేత్రదానం చేసి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపారు.

తల్లి మరణంతో విషాదంలో మునిగిపోయిన కుటుంబం, సమాజ హితం కోరి సదాశయ ఫౌండేషన్ సూచనతో నేత్రదానానికి ముందుకు రావడం అందరినీ కదిలించింది. సదాశయ ఫౌండేషన్ ఓదెల మండల అధ్యక్షుడు డాక్టర్ వేణు నేత్రదానం ప్రాముఖ్యతపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు వెంటనే అంగీకరించారు. అనంతరం వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు సహకారంతో కార్నియాలను సేకరించి సికింద్రాబాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు.“మరణానంతరం కూడా ఇద్దరికి చూపు ఇవ్వగలిగితే అదే నిజమైన సేవ” అనే భావనతో కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం గ్రామంలో ప్రశంసలు అందుకుంది.కొత్తిరెడ్డి లక్ష్మి కుమారులు కొత్తిరెడ్డి రాజిరెడ్డి--సరోజన, సుధాకర్ రెడ్డి--వనజ, నారాయణ రెడ్డి--హరిత, కుమార్తె--అల్లుడు దొండపాటి తిరుమల--శ్రీనివాస రెడ్డి నేత్రదానానికి అంగీకరించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గోలి లింగారెడ్డి, ఉప సర్పంచ్ మూల సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు రమేష్ తదితరులు కుటుంబ సభ్యుల సేవాభావాన్ని కొనియాడారు.అంత్యక్రియల వేళలోనూ సమాజానికి ఉపయోగపడేలా తీసుకున్న ఈ నిర్ణయం కొమిరె గ్రామ ప్రజల హృదయాలను హత్తుకుంది. “మనిషి చనిపోయినా... అతని చూపు ఇంకొకరి జీవితాన్ని వెలిగించగలదు” అనే సందేశాన్ని కొత్తిరెడ్డి లక్ష్మి కుటుంబం సమాజానికి అందించింది.

## కొమిరె నివాసి కొత్తిరెడ్డి లక్ష్మి(82)అనారోగ్యంతో మరణం ...

- **సమాజ హితం కోరి సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు..**
- **అభినందనలు తెలిపిన కమిరె నివాసి మూల సరోజన సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం...**

కుటుంబ సభ్యులకు అభినందనలు తెల్పిన గ్రామ సర్పంచ్ గోలి లింగారెడ్డి. ఉప సర్పంచ్ మూల సంపత్ రెడ్డిమరియు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు..

తేది 25.5.26 ఈ రోజు పెద్దపల్లి జిల్లా, ఓదెల మండలం, కొమిరె గ్రామ నివాసి కొత్తిరెడ్డి లక్ష్మి (82) మరణించగా,సదాశయ ఫౌండేషన్ ఓదెల మండలం అద్యక్షుడు డాక్టర్ వేణు కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా ఒప్పుకోవడంతో, వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు సహకారంతో కార్నియాలు సేకరించి సికింద్రాబాద్ ఐ బ్యాంక్ పంపించడం జరిగింది. ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన కుమారులు కోడండ్లు కొత్తిరెడ్డి రాజిరెడ్డి -సరోజన,.. సుధాకర్ రెడ్డి - వనజ,. నారాయణ రెడ్డి - హరిత,.. కుమార్తె అల్లుడు దొండపాటి తిరుమల -శ్రీనివాస రెడ్డి.. మనుమలు మనుమరా0డ్లకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి ప్రచార కార్యదర్శి వాసు గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి ముఖ్య సలహాదారులు రమేష్, ఓదెల ప్రతినిధులు క్యాతం మల్లేశం, అల్లం సతీష్,క్యాతం వెంకటేశ్వర్లు, మేరుగు సారంగం ఇప్పలపల్లి వెంకటేశ్వర్లు బాలసాని సంతోష్ జీడి నవీన్ అభినందనలు ధన్యవాదాలు తెల్పడం జరిగింది.

## రైతులు పంటల కొయ్యలని, వ్యర్థాలని కాల్చవద్దు



చొప్పదండి/ కరీంనగర్, మే 25 (అక్షరం న్యూస్ )

రైతులు పంటల కొయ్యలని, వ్యర్థాలని, పంటల అవశేషాలని కాల్చవద్దని చొప్పదండి పోలీసులు రైతులకి సూచించారు.ఇటీవలికాలంలో వ్యవసాయ భూముల్లో పంట కోత అనంతరం మిగిలిన గడ్డి, పంట అవశేషాలను రైతులు కాల్చడం వలన మండలంలోని పలు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ప్రస్తుతం ఉన్న ఎండ తీవ్రత, గాలుల ప్రభావంతో మంటలు వేగంగా వ్యాపించి సమీప పంట పొలాలు, విద్యుత్ తీగలు, చెట్లు, గృహాలు మరియు ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగే అవకాశం ఉందని, అదేవిధంగా పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూమి సారవంతత కూడా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో రైతు సోదరులు పంట అవశేషాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తగులబెట్టరాదని రైతులకు పోలీసులు విజ్ఞప్తి చేసినారు ఈ సందర్భంగా రైతులు పాటించవలసిన సూచనలను తెలియచేసారు :

పంట అవశేషాలను కాల్చకుండా పశువుల మేతగా లేదా సేంద్రీయ ఎరువుగా వినియోగించాలి.

పొలాల్లో మంటలు వేయాల్సిన పరిస్థితి వచ్చినా, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకుండా చేయరాదు.

విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, రహదారుల సమీపంలో మంటలు వేయరాదు.

ఎండ, గాలి ఎక్కువగా ఉన్న సమయాల్లో అగ్ని పెట్టడం పూర్తిగా నివారించాలి.

చిన్న మంట కూడా పెద్ద అగ్ని ప్రమాదానికి దారితీయవచ్చని గుర్తుంచుకోవాలి.

ఎక్కడైనా మంటలు కనిపించిన వెంటనే అగ్నిమాపక శాఖ లేదా పోలీసులకు సమాచారం అందించాలి.ప్రజల ప్రాణాలు, ఆస్తులు మరియు పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. రైతులు సహకరించి అగ్ని ప్రమాదాలను నివారించాల్సిందిగా పోలీసులు కోరినారు.

## ముగిసిన సమ్మర్ క్యాంపు... విజేతలకు బహుమతుల ప్రధానం



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )మే 25:

మండలంలోని ఖిలాషాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పదిహేను రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు సోమవారం ముగిసింది. క్యాంపులో విద్యార్థులలో దాగి ఉన్న వివిధ రకాల నైపుణ్యాలతో పాటు సృజనాత్మకతను పెంపొందించే ఆటపాటలు, పర్సనాల్టీ డెవలప్మెంట్, తెలుగు, ఇంగ్లీషు చూచిరాత, కం ప్యూటర్ విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు, స్పోకెన్ ఇంగ్లీష్, ఇండోర్ గేమ్స్ తదితర అంశాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించారు. క్యాంపులో వివిధ అంశాలలో చురుకుగా పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భారత రవీందర్ బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు బూరుగు లావణ్య, రిసోర్స్ పర్సన్లు బి.సంపత్, సిహెచ్ ఎల్లస్వామి, తాటికొండ పంచాక్షరీ, సరాబు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు

## బ్లాక్ హెడ్స్ సమస్య ఉన్నవారు ఈ సహజసిద్ధమైన చిట్కాలను పాటించాలి..!

చాలా మంది ఎదుర్కొనే వివిధ రకాల చర్మ సమస్యల్లో బ్లాక్‌హెడ్స్ కూడా ఒకటి. ఇది చాలా సాధారణమైన చర్మ సమస్య అని చెప్పవచ్చు. ఆయిల్ చర్మం ఉన్న వారిలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. సాధారణంగా ముక్కు, గడ్డం, నుదురు ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. చర్మపు రంధ్రాలు అధిక ఆయిల్, మృత కణాలు, ధూళితో మూసుకుపోయినప్పుడు బ్లాక్‌హెడ్స్ ఏర్పడతాయి. వైట్‌హెడ్స్‌లా కాకుండా బ్లాక్‌హెడ్స్ చర్మం పైభాగంలో ఓపెన్‌గా ఉంటాయి. రంధ్రాల్లో చిక్కుకున్న పదార్థం గాలిలోని ఆక్సిజన్‌తో ప్రతిచర్యకు లోనై నలుపు రంగులోకి మారుతుంది. ఈ పరిస్థితిని వైద్యపరంగా ాాఎఅవ అని అంటారు. తీవ్రమైన బ్లాక్‌హెడ్స్ తో బాధపడే వారు తప్పకుండా చర్మ వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. అయితే కొన్ని సహజ చిట్కాలను ఉపయోగించి కూడా బ్లాక్ హెడ్స్ ను తొలగించుకోవచ్చు. బ్లాక్‌హెడ్స్ ను తగ్గించే కొన్ని సహజ చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### తేనె, నిమ్మరసం మాస్క్..

తేనె, నిమ్మకాయ మాస్క్ ను ఉపయోగించి బ్లాక్ హెడ్స్ ను తొలగించుకోవచ్చు. తేనెలో సహజ యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. నిమ్మకాయలో మృదువైన ఎక్స్‌ఫోలియేటింగ్ ఆమ్లాలు ఉంటాయి. ఇవి మృత చర్మ కణాలను తొలగించడంలో సహాయపడతాయి. ఈ మాస్క్ ను తయారు చేసుకోవడానికి ఒక టీ స్పూన్ తేనెలో కొన్ని చుక్కల నిమ్మరసం కలిపి బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రాంతాల్లో సున్నితంగా రాయాలి. దీనిని 10-15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఈ మాస్క్ చర్మ రంధ్రాలను శుభ్రపరచి ఆయిల్ పేరుకుపోవడాన్ని తగ్గిస్తుంది. అయితే సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు నిమ్మరసాన్ని జాగ్రత్తగా ఉపయోగించాలి. అలాగే ముఖానికి ఆవిరి పట్టడం ద్వారా రంధ్రాల్లో చిక్కుకున్న మలినాలను తొలగిపోతాయి. నీటిని మరిగించి, ముఖానికి సురక్షిత దూరంలో 5 నుంచి 10 నిమిషాలు ఆవిరి తగిలేలా ఉండాలి. వేడి వల్ల చర్మం మృదువుగా మారి రంధ్రాలు తెరుచుకుంటాయి. తర్వాత మృదువుగా ముఖం శుభ్రం చేసుకోవడం వల్ల బ్లాక్‌హెడ్స్ తొలగిపోతాయి. అయితే ఎక్కువసార్లు స్టీమ్ చేయడం చర్మానికి ఇబ్బంది కలగవచ్చు.

## ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్లో అగ్నికి ఆహుతి అయిన దుర్గా వైన్స్ .. నిందితుడు అరెస్టు



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్లో దుర్గా వైన్స్‌లో అర్ధరాత్రి సమయంలో ఓ వ్యక్తి చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సోమవారం నిందితుడిని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై టి.ఉదయ్ కిరణ్ అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో హత్య కేసులో నిందితుడిగా ఉన్న పొయిల రాజు ప్రస్తుతం కరీంనగర్‌లో నివసిస్తున్నాడు. పాత కేసులో ఇటీవల కోర్టు వాయిదా హాజరయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం రోజున మద్యం సేవించడానికి వైన్స్‌కు వెళ్లి మద్యం సేవించాడు. ఈ క్రమంలో అతడి మొబైల్‌కు సంబంధించిన పవర్ బ్యాంకు వైన్స్‌లో పొగొట్టుకున్నాడు. రాజు వైన్‌షాపుకు వచ్చి పవర్ బ్యాంకు విషయమై ఆరాతీశాడు. సరైన సమాచారం తెలియకపోవడంతో పవర్ బ్యాంకు ఆచూకీ లభించకపోవడంతో ఆగ్రహానికి గురైన అతడు అదే విషయాన్ని మనసులో పెట్టుకొని అర్ధరాత్రి సమయంలో వైన్స్‌లోకి చొరబడ్డాడు. అనంతరం అక్కడ ఉన్న కుర్చీలు, టేబుళ్లు తదితర ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి దర్జాగా బయటకు వెళ్లి పోయాడు. వైన్స్ దుకాణం నుండి మంటలు రావడంతో స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాద ఘటనతో వైన్స్ యజమాని నీలపు తిరుపతి రెడ్డి పోలీసుల ఫిర్యాదు చేశాడు. నాలుగు లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. వెంటనే అతడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం రాజును అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.

## రౌడీ షీటర్లు తమ ప్రవర్తనను మార్చుకోవాలి

- స్టేషన్ ఘనాపూర్ ఏసీపీ భీంశర్మ



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )మే 25: అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్టేషన్ ఘనాపూర్ ఏసీపీ భీంశర్మ రౌడీ షీటర్లను హెచ్చరించారు. రఘునాథపల్లి పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో రౌడీ షీటర్లకు స్టేషన్ ఘన్ పూర్ ఏసీపీ భీంశర్మతో పాటు సిఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రౌడీ షీటర్లు ఇప్పటికైనా తమ ప్రవర్తనను మార్చుకొని చట్ట వ్యతిరేక కార్యకలపాలకు దూరంగా ఉండాలని, భూ కబ్జాలకు పాల్పడడం మానుకోవడంతో పాటు భూములకు సంబంధించిన పంచాయతీలు, సెటిల్మెంట్లకు ఎంత దూరంలో ఉంటే అంతా మంచిదని గుర్తించి అందుకనుగుణంగా వ్యవహరించి నేర ప్రవృతికి దూరంగా ఉండాలని సూచించారు. నేరాలకు పాల్పడకుండ ఉండేందుకు రౌడీ షీటర్లపై పోలీసుల నిరంతర పర్యవే క్షణ ఉంటుందని, మళ్లీ నేరాలకు పాల్పడే రౌడీ షీటర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రౌడీ షీటర్లను తహసీల్దార్ రాజేష్ రెడ్డి ముందు బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు డి.నరేష్ యాదవ్, శ్రావణ్ కుమార్, ఏఎస్ఐ కట్టమల్లు తోపాటు సిబ్బంది పాల్గొన్నారు

## సెలవుల రద్దుపై సమత సైనిక్ దళ్ ఆగ్రహం

- ఉద్యోగులను బానిసల్లా చూడొద్దు
- డాక్టర్ మార్షల్ దుర్గం
- జల్ శక్తి అభియాన్ పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 'జల్ శక్తి అభియాన్' కార్యక్రమం పేరుతో ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తూ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌పై సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మండుతున్న ఎండల్లో సిబ్బందిని ప్రతిరోజూ 100 ఇళ్లను సందర్శించాలని ఆదేశించడం పూర్తిగా అమానవీయ చర్య అని విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు ఉద్యోగులు ఎప్పుడూ సహకరిస్తారని, అయితే వారిని యంత్రాల్లా పనిచేయించాలని ఒత్తిడి తేవడం సరికాదన్నారు.పండుగలు, సెలవులు లేకుండా సిబ్బందిపై అదనపు భారం మోపడం వల్ల కుటుంబ జీవితం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరిన ఆయన, రద్దు చేసిన సెలవులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒకేసారి 100 ఇళ్లను సందర్శించాలనే నిబంధనను సడలించి, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు.ఉద్యోగుల హక్కులను కాలరాసే విధంగా ఉన్న ఈ సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని డాక్టర్ మార్షల్ దుర్గం హెచ్చరించారు.అధికారులు తక్షణమే స్పందించి సిబ్బంది పట్ల సానుకూల వైఖరి అవలంబించాలని ఆయన కోరారు.

## ములుకనూరులో స్వాతంత్ర్య సమరయోధుడు
## పడాల చంద్రయ్య స్మారకంగా వ్యాయామశాల ఏర్పాటు చేయాలి

- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు డాక్టర్ ఎదులపురం తిరుపతి వినతి..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 25 /అక్షరం న్యూస్–:

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామంలో యువత అభివృద్ధి, గ్రామ సమగ్ర రూపాంతరానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని హిమాచల్ ప్రదేశ్ హర్యానా రాష్ట్రాల మాజీ గవర్నర్, సీనియర్ జాతీయ నాయకుడు బండారు దత్తాత్రేయను డాక్టర్ ఎదులపురం తిరుపతి కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని డాక్టర్ తిరుపతి వివరించారు. ముఖ్యంగా ములుకనూరు గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దేశభక్తుడు దివంగత పడాల చంద్రయ్య సేవలను స్మరించుకుంటూ ఆయన స్ఫూర్తి భావితరాలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.యువత శారీరక దృఢత్వం, మానసిక వికాసం కోసం ములుకనూరులో పడాల చంద్రయ్య స్మారక ప్రభుత్వ వ్యాయామశాలను అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ గవర్నర్‌కు ప్రత్యేక వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ యువత క్రీడల వైపు ఆకర్షితులై ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావడానికి ఇలాంటి వ్యాయామశాలలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ములుకనూరు గ్రామ అభివృద్ధికి సంబంధించి తీసుకువచ్చిన ప్రతిపాదనలను సానుకూలం గా పరిశీలిస్తానని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హామీ ఇచ్చినట్లు డాక్టర్ తిరుపతి తెలిపారు.

## అక్రిడేషన్ కార్డ్స్ వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇవ్వాలి

- జర్నలిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్..
- అనర్హుల్ని తొలగించాలని జెఎస్ఎస్ డిమాండ్..
- అక్షర జ్ఞానం లేని వారు కూడా జర్నలిస్టులేనా..
- వార్తలు రాయని జర్నలిస్టులను తొలగించాలి..



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / మే 25 / అక్షరం న్యూస్ –:

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని జెఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం రోజున ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ కి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడలేని విధంగా పెద్దపల్లి జిల్లాలో అనర్హులు అక్రిడేషన్లు అందుకుంటున్నారని, జిల్లాలో ప్రభుత్వం రేషన్ షాప్ డీలర్లు, వ్యాపారస్తులు, అక్రిడియేషన్స్ 30 వేల నుండి 40 వేల వరకు కొనుగోలు చేస్తున్నారని, నిజమైన జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని, ఒక సంస్థలో పని చేస్తూ వేరొక సంస్థ ద్వారా అక్రిడేషన్స్ పొందుతున్నారని, ఒక నిరుద్యోగికి ప్రభుత్వ ఉద్యోగం వస్తే ఎస్బి ఎంక్వైరీ, ఇంటలిజెంట్ ఎంక్వయిరీ ఏ విధంగా వారిపై గతంలో ఏమైనా క్రిమినల్ కేసులు నమోదయాయని, విద్యార్హతలు ధృవీకరణ పత్రాలు నిజమైనవా..?కావా..? అని ఏ విధంగా ధ్రువీకరించుకుంటున్నారో అదేవిధంగా జర్నలిస్టులపై ఎంక్వయిరీ చేసి ధ్రువేకరించుకున్నాకనే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కొంతమందిపై పోలీసు రికార్డులో క్రిమినల్ కేసులు, బ్లాక్మెయిల్ కేసులు ఉన్నవారికి కూడా అక్రిడేషన్ కార్డులు ఉండటం,నిజమైన వర్కింగ్ జర్నలిస్టు చేసుకున్న పాపం అనడంలో సందేహం లేదు అని అన్నరు.ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్తున్న నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేస్తూ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నేర్పించుకోవాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ అక్రిడేషన్ పై దృష్టి సాధించి నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జాతీయ కార్యదర్శి సబ్బితం లక్ష్మణ్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు వోడ్నాల లత, కన్నూరి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘు, ఉపాధ్యక్షులు రావుల రాజకుమార్, ప్రచార కార్యదర్శి అనిల్, జిల్లా కోశాధికారి ఉమేష్, సుమన్ టీవీ లావణ్య రెడ్డి, జెఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## అన్నవరం శ్రీ వీర సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్న బీర్ల అయిలయ్య- అనిత దంపతులు



యాదాద్రి భువనగిరి జిల్లా / యాదగిరిగుట్ట /మే 25 : అక్షరం న్యూస్ –:

తెలుగు దినపత్రిక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య – శ్రీమతి బీర్ల అనిత ,తమ 25వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు...

## ఎమ్మెల్యే బిర్ల ఐలయ్య పెళ్లిరోజు సందర్భంగా అనాధాశ్రమంలో పండ్ల పంపిణీ

- యాదాద్రి భువనగిరి జిల్లా సెక్రెటరీ గుండు నరసింహ గౌడ్..




యాదాద్రి భువనగిరి జిల్లా / యాదగిరిగుట్ట /మే 25 : అక్షరం న్యూస్ – :ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బిర్లా ఫౌండేషన్ చైర్మన్ బిర్లా అనిత ఐలయ్య గార్ల పెళ్లిరోజు సందర్భంగా సహృదయ అనాధాశ్రమంలో పండ్ల పంపిణీ చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా సెక్రెటరీ గుండు నరసింహ గౌడ్. ఈ కార్యక్రమంలో యాదిగిరి గుట్ట మండల ఉపాధ్యక్షులు మైలార్ గూడెం ఉపసర్పంచ్ బండి అశోక్ , యాదగిరిగుట్ట టౌన్ ఉపాధ్యక్షులు కౌకుంట్ల బాల్ రెడ్డి, సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్కే జమాల్, చింతకింది రాజు నేత, గోర్ల నరేష్ నేత, షేక్ హుస్సేన్, ఆరే సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ కౌన్సిల్ సమావేశం

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.**

**ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి : సయ్యద్ సలీం.**




భద్రాద్రి కొత్తగూడెం/ అశ్వారావుపేట / మే 25 / అక్షరం న్యూస్ –:

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ అశ్వారావుపేట మండల, పట్టణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అశ్వారావుపేట కేంద్రంలోని సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యాలయం సయ్యద్ మియాజాని భవన్‌లో మండల కార్యదర్శి వగ్గెల అర్జునరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ సలీం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి.**

ఈ సందర్భంగా సయ్యద్ సలీం మాట్లాడుతూ అశ్వారావుపేట మండలం, పట్టణంలో అనేక ప్రజా సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ శాఖ కార్యదర్శులు 2026 సభ్యత్వ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

**అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్లు ఇవ్వాలి.**

అశ్వారావుపేట మండలం, పట్టణ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అనర్హులకు ప్రాధాన్యం ఇస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలి.**

కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, కర్షక వ్యతిరేక విధానాలతో ముందుకు వెళ్తోందని, ప్రజలపై భారాలు మోపే నిర్ణయాలను వ్యతిరేకించాలని సయ్యద్ సలీం అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించే విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గన్నిన రామకృష్ణ, పట్టణ కార్యదర్శి నూకవరపు విజయ్ కాంత్, సహాయ కార్యదర్శి సయ్యద్ జాకీర్, మహిళా సంఘం నాయకులు చీపుర్ల సత్యవతి, రిజ్వానా, రోహిణి, శ్రావణి, మార్తిన సత్యవతి, సిపిఐ నాయకులు చెన్నారావు, వెంకన్న, ప్రసాద్, విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జాతర ఏర్పాట్లను పరిశీలించిన సీఐ



రాజన్న సిరిసిల్ల /ఇల్లంతకుంట / మే 25/ అక్షరం న్యూస్ :-

కందికట్కూర్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ జాతర నేపథ్యంలో సోమవారం సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వర్ రావు, స్థానిక ఎస్ఐ అశోక్‌తో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ జాతర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జాతరలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా భక్తులు పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ అశోక్, టెంపుల్ నిర్వాహకులు కంది రాజిరెడ్డి, కంది శ్రీనివాస్ రెడ్డి, కంది లింగారెడ్డి, గుర్రం వెంకట్రామిరెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, కంది బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులకు శ్రీకారం



రాజన్న సిరిసిల్ల /ఇల్లంతకుంట / మే 25/అక్షరం న్యూస్ -:

పెద్ద లింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులలో భాగంగా కొత్త కుంట నుండి పంగిడి చెరువు వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర ఫీడర్ ఛానల్ పూడికతీత పనులను సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య ప్రారంభించారు. కాలువల పూడికతీత పనులతో వేసవి కాలంలో చెరువులకు నీటి సరఫరా చేసే కాలువలను సంరక్షించుకోవాలన్నారు. రంగనాయక సాగర్ నుండి వచ్చే నీరు ఈ కాలువల ద్వారానే ప్రవహిస్తున్న నేపథ్యంలో కాలువకు అడ్డుగా గోడ నిర్మాణం అవసరమైందని, దీనికి సంబంధించిన నిధులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు పూర్తయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.

ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉదయం పనులు ముగించుకొవాలని సూచించారు.

# భగ్గుమంటున్న ఎండల్లోనూ సేవా కార్యక్రమం కొనసాగిస్తున్న 29వ డివిజన్ కార్పొరేటర్ సాగర్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ గొల్లగూడెం/25 మే / అక్షరం న్యూస్ :

పెరుగుతున్న ఉష్ణోగ్రతల మధ్య మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండుతున్న ఎండలను లెక్కచేయకుండా స్వయంగా మొక్కలకు నీళ్లు పోస్తూ పర్యావరణ పరిరక్షణపై తన బాధ్యతను చాటుతున్నారు.ప్రజలకు నీడనిచ్చే ప్రతి మొక్కను సంరక్షించడం మనందరి బాధ్యత అని కార్పొరేటర్ సాగర్ పేర్కొన్నారు."ఒక్క మొక్కను కాపాడితే భవిష్యత్తు తరాలకు ప్రాణవాయువును అందించినట్టే" అని తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పవన్, ప్రసాద్, ముక్తార్ పాల్గొన్నారు.

# కొలిమికుంట అంగన్వాడీ కేంద్రంలో మహిళా వారోత్సచవము



చొప్పదండి/ కరీంనగర్, మే 25( అక్షరం న్యూస్ )

చొప్పదండి మండలం లోని కొలిమికుంటలోని అంగన్వాడీ కేంద్రం లో సోమవారం రోజున మహిళా వారోత్సవము నిర్వహించారు. ఈయొక్క కార్యక్రమంలో పిల్లల తల్లులకు ఫుడ్ కాంపిటేషన్ ను నిర్వహించారు. ఈయొక్క కార్యక్రమంలో సర్పంచ్ చొక్కాల తిరుపతి,, గ్రామ కార్యదర్శి శేఖర్, అంగన్వాడీ సూపర్ వైజర్ మసరత్, సుధారాణి, ఉప సర్పంచ్ పంజాల లక్ష్మణ్, అంగన్వాడీ టీచర్ మళ్ళీశ్వరిలు పాల్గొన్నారు.

# రుమలకుంటలో అంబరాన్నంటిన ఆదివాసుల 'భూమి పండుగ'





- వైభవంగా భూదేవి ఉత్సవాలు
- ప్రకృతిని, నేలను పూజించిన గిరిజనులు.

భద్రాద్రి కొత్తగూడెం/

అశ్వారావుపేట / మే 25 / అక్షరం న్యూస్ -: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామ పంచాయతీలో ఆదివాసుల విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే "భూమి పండుగ" (భూదేవి పండుగ) సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కొత్త వ్యవసాయ సీజన్ ప్రారంభానికి సంకేతంగా జరుపుకునే ఈ పండుగలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, గ్రామంలో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

### సాంప్రదాయబద్ధంగా భూదేవి పూజలు.

గ్రామ సర్పంచ్ కోర్స రాజేష్, గ్రామ పెద్దలు నారాం బొంజారావు, మోడియం వీరేశ్వరావుల ఆధ్వర్యంలో గ్రామ పొలిమేరలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన పూజారులు భూమాతకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం రాబోయే పంటకాలానికి ఉపయోగించే విత్తనాలకు పూజలు నిర్వహించి సాగుకు సిద్ధం చేశారు.

### రేలా రేలా పాటలతో సందడి.

పండుగలో ప్రధాన ఆకర్షణగా గిరిజనుల సాంప్రదాయ నృత్యాలు నిలిచాయి. మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో ముస్తాబై వలయాకారంగా తిరుగుతూ 'రేలా రేలా' పాటలకు నృత్యాలు చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ పాల్గొనడంతో గ్రామం పండుగ వాతావరణంతో కళకళలాడింది.

### ప్రకృతే మా దైవం.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆదివాసుల జీవితం ప్రకృతితో ముడిపడి ఉంటుందని, అడవిని, భూమిని దైవంగా భావిస్తామని తెలిపారు. భూదేవిని పూజించడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని, నేటి యువత కూడా దానిని కొనసాగించడం ఆనందంగా ఉందన్నారు.

### సామూహిక విందుతో ముగింపు.

భూమి పూజ అనంతరం గ్రామస్తులంతా కలిసి సామూహిక కార్యక్రమాలు నిర్వహించి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, రైతులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు. పండుగ సంబరాలతో తిరుమలకుంట గ్రామంలో ఆదివాసి సంస్కృతి, పల్లె అందాలు ఉట్టిపడ్డాయి.





# గ్రామీణ మహిళల సాధికారతకు మరో అడుగు





- మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన.
- గ్రామీణ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.

భద్రాద్రి కొత్తగూడెం/అశ్వారావుపేట / మే 25 / అక్షరం న్యూస్ -:

గ్రామీణ మహిళల సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం గ్రామీణ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గుండుగులపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య భవనానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శంకుస్థాపన చేశారు.

### మహిళల అభివృద్ధికి ఉపయోగపడే కేంద్రాలు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలపడేందుకు మహిళా సమాఖ్య భవనాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనాలు కేంద్రాలుగా మారనున్నాయని పేర్కొన్నారు.

### మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

గ్రామీణ మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళా అభివృద్ధి, గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### నియోజకవర్గ వ్యాప్తంగా కార్యక్రమాలు.

ఎమ్మెల్యే సూచనల మేరకు అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య భవనాల శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# కోటి మంది మహిళలకు కొత్త చీరల పంపిణీ

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని, ఆర్థిక స్వావలంబనను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "కోటి మంది మహిళలకు కొత్త చీరల పంపిణీ" కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కొత్త చీరల డిజైన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ కూడా పాల్గొని మహిళా సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు.తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం మరియు సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి మహిళలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చీరల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కొత్త డిజైన్ల చీరలను ఆవిష్కరించడం ద్వారా సంప్రదాయాన్ని, ఆధునికతను సమన్వయం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, మహిళల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు కూడా గౌరవప్రదమైన జీవన ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళల ఆత్మనిర్భరతకు తోడ్పడే విధంగా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, సంక్షేమ




పథకాల ద్వారా వారికి ఆర్థిక భరోసా ఇవ్వడం వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు మహిళల అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభమని అభిప్రాయపడ్డారు. కోటి మంది మహిళలకు కొత్త చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళల పట్ల ఉన్న నిబద్ధతను మరోసారి చాటిచెప్పిందని తెలిపారు.

## నేడు చొప్పదండి రైతు వేదికలో రైతు నేస్తం




చొప్పదండి /కరీంనగర్, మే 25 (అక్షరం న్యూస్ )

మంగళవారం ఉదయం 9:45 గంటలకు చొప్పదండి రైతు వేదిక నందు దృశ్య శ్రవణ మధ్యమం ( వీడియో కాన్ఫరెన్స్) ద్వారా రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వరి మొక్కజొన్న, ఇతర పంటల యొక్క అవశేషాలను కాల్చడం ద్వారా జరిగే అనార్థాల గురించి, కాల్చడం నివారించడానికి ప్రభుత్వం తీసుకునే చర్యల గురించి, పంట అవశేషాలను కాల్చడం ద్వారా జరిగే నష్టాల గురించి లైవ్ ద్వారా రైతులు వివరించడం గురించి చర్చించడం జరుగుతుందని చొప్పదండి వ్యవసాయ అధికారులు తెలిపారు.కావున రైతు సోదరులు తప్పనిసరిగా అధిక సంఖ్య లో హాజరుకావాలనివ్యవసాయ శాఖచొప్పదండి క్లస్టర్ ఏఈవో తెలిపారు.

## ఉదయ్‌నగర్‌లో మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, వారి సతీమణి మనాలి ఠాకూర్ సోమవారం ఉదయ్‌నగర్‌లోని ఉదయ్ స్లమ్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.మహిళలు స్వయం సమృద్ధిగా ఎదిగి కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించాలని ఆమె ఆకాంక్షించారు. సమాజ సేవా కార్యక్రమాల్లో మహిళలు ముందుండి సేవాభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, సమాఖ్య సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చొప్పదండి పీఏసీఎస్ లో అందుబాటులో పచ్చి రొట్టె ఎరువులు,జీలుగ




చొప్పదండి /కరీంనగర్,మే 25 (అక్షరం న్యూస్ )

పచ్చి రొట్టె ఎరువులు జీలుగ పీఏసీఎస్ చొప్పదండిలో అందుబాటులో ఉన్నాయి .కావున రైతులు భూమి పట్టా పాస్ బుక్ జిరాక్స్ , ఆధార్ కార్డ్ జిరాక్స్, మొబైల్ (ఫోన్ ) తీసుకొని వెల్లి కొనుగోలు చేయగలరని,30 కేజీల బ్యాగు రెండున్నర నుండి మూడు ఎకరాల వరకు విత్తనం వేసుకోవచ్చుని,జీలుగ 30 కేజీల సంచి ధర 2452.50 రూపాయలని చొప్పదండి మండలవ్యవసాయ అధికారి తెలిపారు.

## గ్రామ స్వయం సహాయక సంఘ భవనానికి శంకుస్థాపన ...



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 తల్లాడ (అక్షరం న్యూస్)

ఇందిరా క్రాంతి పధకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత చేర్చటం కొరకు స్వయం సహాయక సంఘాల భవనానికి బిల్లుపాడు గ్రామంలో సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి నరసింహారావు చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పిలుపు మేరకుప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం చేపట్టాలనే దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం గ్రామ సంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్,పంచాయతీ కార్యదర్శి బి. సాయికుమార్, లాజర్, ఎన్నిక నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ దీపికలు, అంగన్వాడి సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి వి.ఓ.ఏల సమ్మె ఉధృతం

- నాలుగో రోజుకు చేరిన నిరసనలు.
- డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి.



భద్రాద్రి కొత్తగూడెం/అశ్వారావుపేట / మే 25 / అక్షరం న్యూస్ –

:తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐకెపి వి.ఓ.ఏలు చేపట్టిన సమ్మె రోజురోజుకు ఉధృతమవుతోంది. నాలుగో రోజుకు చేరిన ఆందోళనలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్ద వి.ఓ.ఏలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసనలు చేపట్టారు. మహిళా వి.ఓ.ఏలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి.

తమకు నెలకు కనీసం రూ.26 వేల వేతనం అమలు చేయాలని వి.ఓ.ఏలు ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం అందుతున్న పారితోషికం కుటుంబ పోషణకు సరిపోవడం లేదని, పెరుగుతున్న ధరలతో జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

### ఉద్యోగ భద్రతతో పాటు బీమా సదుపాయాలు కావాలి.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల అభివృద్ధి, పొదుపు సంఘాల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తమకు తగిన గుర్తింపు లేదని వి.ఓ.ఏలు పేర్కొన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

### పదోన్నతులపై స్పష్టత కోరిన వి.ఓ.ఏలు.

అర్హతలు, అనుభవం ఉన్న వి.ఓ.ఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, హెచ్.ఆర్ పాలసీ వర్తింపజేయాలని కోరారు. పదోన్నతుల విషయంలో స్పష్టత లేక ఉద్యోగ భవిష్యత్తుపై ఆందోళన నెలకొన్నదని తెలిపారు.

### ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక.

ఐకెపి వి.ఓ.ఏలు బుజ్జి, దాసరి రేవతి మాట్లాడుతూ తమ డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవేనని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక ప్రజా సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు కూడా వారికి మద్దతు ప్రకటించారు. సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఐకెపి కార్యకలాపాలు ప్రభావితమవుతున్నప్పటికీ సమస్యల పరిష్కారం వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.


## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని

# కలిసిన ఎమ్మెల్యే కూనంనేని, రాష్ట్ర బృందం





- కేటీపీఎస్ పాత స్టేషన్ల స్థానంలో కొత్తగా 2/800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మించాలి.
- కిన్నెరసాని పర్యాటక రంగ అభివృద్ధికి, బడ్జెట్ హోటల్ పనులకు నిధులు మంజూరు చేయాలి.
- ముర్రేడు వాగు రక్షణ గోడ నిర్మాణానికి, సీతారామ ప్రాజెక్ట్ కాలువల పొడిగింపునకు బడ్జెట్ కేటాయించాలి.
- నియోజకవర్గానికి సమగ్ర క్రీడా స్టేడియం, మహిళల రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలి.
- కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు, పోడు భూముల సమస్యలను పరిష్కరించాలి.
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పాల్వంచ సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి.
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.



హైదరాబాద్ / మే 25 / అక్షరం న్యూస్ –: : కొత్తగూడెం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. సోమవారం హైదరాబాద్ సచివాలయంలో ం ా త్ర వు ు ఖ్య వు ం త్రి రేవంత్ రెడ్డిని కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని సిపిఐ రాష్ట్ర ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలు, అభివృద్ధి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీపీఎస్ పాత ఎ, బి, సి స్టేషన్ల స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల రెండు విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించాలని, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు కొత్త ఆర్టీసీ బస్ స్టాండ్ భవనాలను మంజూరు కోరామన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీని “కొత్తగూడెం--పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్”గా మార్చాలని కోరామని, కిన్నెరసాని ప్రాజెక్ట్ పర్యాటక అభివృద్ధికి, హరిత రిసార్ట్, బడ్జెట్ హోటల్ ముగింపు పనులకు అదనపు నిధులు ఇవ్వాలన్నారు. ముర్రేడు వాగు రీన్‌ఫోర్స్ సాయిల్ వాల్ నిర్మాణానికి ?50.50 కోట్లు, సింగభూపాలెం, చింతల చెరువు ఆధునీకరణకు నిధులు క్లియర్ చేయాలని, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంపిణీ కాలువల డిజైన్ మార్చాలని కోరారు. విద్యా, క్రీడారంగాల కోసం 20 ఎకరాల్లో సమగ్ర క్రీడా స్టేడియం, మహిళల రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ పనులకు రూ 1160 లక్షలు, గిరిజన మహిళా డిగ్రీ కాలేజీ భవనానికి 30 కోట్లు మంజూరు చేయాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల పునర్నిర్మాణానికి 25 కోట్లు, సుజాతనగర్ జూనియర్ కాలేజీ, కొత్త ఐటీఐలలో సిబ్బందిని కేటాయించాలన్నారు. వైద్య సేవల్లో భాగంగా పాల్వంచ సీహెచ్‌సీని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని, జీజీహెచ్ కొత్తగూడెంలో కాత్ ల్యాబ్, ఎంఆర్ఐ స్కాన్ సౌకర్యాలు కల్పించి, పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. జీవో నెం.76 కింద ఇళ్ల క్రమబద్ధీకరణ, పెండింగ్ పోడు భూముల పట్టాల సమస్యను పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను విడుదల చేయాలని కోరారు. కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని, పాస్‌పోర్ట్ ఆఫీస్, మైలారం రాగి గని పునఃప్రారంభం, పాండురంగాపురం-భద్రాచలం రైల్వే లైన్ సాధన, డీఎంఎఫ్ టీ నిధుల విడుదల అత్యంత అవసరమన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ రోడ్లు, వంతెనల నిర్మాణానికి, ఎంఆర్ఓ, జెడ్పీ, ఎంపీడీఓ శాశ్వత కార్యాలయ భవనాలకు నిధులు ఇవ్వాలని కోరారు. చివరగా నియోజకవర్గంలోని కొత్తగూడెం, పాల్వంచ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తాము అందించిన వినతిపత్రంలో అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కూనంనేని తెలిపారు.

# 31న జరిగే ఏఐకేఎంఎస్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి




జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట్ గ్రామంలో సోమవారం ఏఐకేఎంఎస్ 4వ జిల్లా మహాసభల పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేష్ మాట్లాడుతూ ఈ నెల 31న నిర్వహించనున్న మహాసభలకు రైతు, కూలీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రస్తుతం ఐకేపీ కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మద్దతు ధర పూర్తిగా అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించడంతో పాటు విద్యుత్, విత్తన చట్టం--2025ను రద్దు చేయాలని కోరారు.

ఈ మహాసభలకు సీనియర్ జర్నలిస్టు కోలా లక్ష్మణ్ ప్రారంభోపన్యాసం చేయనుండగా, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు వి. కోటేశ్వరరావు, మామిడాల బిక్షపతి, మండల వెంకన్న, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే. రాజన్న తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐ. రాజేశం, గుండేటి మల్లేశం, దోనూరి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయల అరెస్టు కేసు నమోదు ...

- **వైరా ఎస్సై పుష్పాల రామారావు**



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 25 /వైరా ( అక్షరం న్యూస్)

వైరా పట్టణంలోని హనుమాన్ బజార్ సమీపంలోని స్మశాన వాటిక వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులో తీసుకొని వారి వద్ద 3980 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వైరా పట్టణ ఎస్ఐ పి రామారావు తెలిపారు. ఈరోజు సాయంత్రం అందాజు సాయంత్రం ఐదు గంటల సమయంలో వైరా పట్టణ అదనపు ఎస్సై పవన్ ఆధ్వర్యంలో విశ్వసిన్య సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి నిర్వహించగా హనుమాన్ బజార్ కి చెందిన బండి ఉపేందర్ ఓర్సు శ్రీను బండి కోటేశ్వరరావు దేరంగుల నరసింహారావు వేముల పుల్లారావు ఉప్పు శ్రీను వల్లపు చిన్నబ్బాయి ఓర్సు కళ్యాణ్ లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అడవుల సంరక్షణ, వన్యప్రాణుల రక్షణ మరింత సమర్థవంతంగా జరగాలి

- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామో దర్ రాజనర్సింహ ,అటవీశాఖమంత్రి కొం డా సురేఖ**



సంగారెడ్డి జిల్లా /మే 25/అక్షరం న్యూస్ :

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పర్యావరణ పరి రక్షణ, అటవీ శాఖ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక అడుగు పడింది.పట్టణంలో అత్యాధునిక వసతుల తో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీ శా ఖ కార్యాలయ సముదాయాన్ని బీట్ ఆఫీ సర్ క్వార్టర్స్‌ను ఈరోజు ఘనంగా ప్రారం భించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజన ర్సింహ ,రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదా య శాఖమంత్రికొండాసురేఖ హాజరయ్యా రు.ఈ సందర్భంగా మంత్రులు ఎమ్మెల్యే కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటా రు. అనంతరం ఏర్పాటు చేసిన సమావే శంలో వారుమాట్లాడుతూ అటవీ శాఖ అ ధికారులు, సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించడం ద్వారా అడవుల సంరక్షణ, వ న్యప్రాణుల రక్షణ మరింత సమర్థవంతం గా జరుగుతుందని ఆశాభావంవ్యక్తంచేశా రు.పచ్చదనాన్నిపెంపొందించడంలో పర్యా వరణ సమతుల్యతను కాపాడటంలో సం గారెడ్డి జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా ని లపాలని పిలుపునిచ్చారు.నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లా డుతూ జిల్లా కేంద్రంలో ఇంతటి అత్యాధు నిక వసతులతో కార్యాలయ సముదాయం అందుబాటులోకి రావడం సంతోషకరమ ని, ఇది అటవీ శాఖ సిబ్బందికి మరింత ఉ త్సాహంతో పనిచేసే వాతావరణాన్ని కల్పి స్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నా రాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జి ల్లా అటవీ శాఖ అధికారీ కే అరవింద్, ప్రసా ద్ రెడ్డి అటవీ శాఖ ఉన్నతాధికారులు (సీ. సీఎఫ్ డిఎఫ్ ఓ ), స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు అటవీ శాఖ సి బ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులే భావి భారత నిర్మాతలు : డీఎస్పీ వెంకటరెడ్డి







సంగారెడ్డి జిల్లా /నారాయణఖేడ్ /మే 25/అక్షరం న్యూస్ :నారాయణఖేడ్ పట్టణం లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహిం చిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా డీఎస్పీ వెంకటరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భార త దేశ నిర్మాతలని అన్నారు. వేసవి సెలవు లను వృథాచేయకుండా విద్యార్థుల్లో మాన సిక, శారీరక వికాసాన్ని పెంపొందించేలా క్రీ డలు, యోగ, సంగీతం, చిత్రకళ, బ్యూటీష న్ తదితర అంశాలలో ఉచితశిక్షణ అందిం చడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం విద్యార్థులు సెల్‌ఫోన్ వ్యామోహంలో పడు తూ ఆటపాటలు, సృజనాత్మక కార్యక్రమా లకు దూరమవుతున్నారని, అలాంటి పరి స్థితుల్లో ఈ సమ్మర్ క్యాంపు వారిలో క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెం పొందించేందుకు ఎంతోదోహదపడిందన్నా రు.గత 15 రోజులుగా విద్యార్థులు నేర్చు కున్న ప్రతిభను ప్రదర్శించడం ఆనందంగా ఉందని కొనియాడారు. అనంతరం విద్యా ర్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్ఎం మన్మథ కిషోర్, ఉపాధ్యాయులు యాదగిరి, రాజశేఖర్, అ శోక్ గౌడ్, చంద్రశేఖర్ ఆచార్య, డాక్టర్ రాజ య్య, గురునాథ్, ధన్‌సింగ్, లీపు ఆర్టిస్టు శి వకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వాణి కి విశిష్ట స్పందన

సంగారెడ్డి జిల్లా /నారాయణఖేడ్ /మే 25/అక్షరం న్యూస్ :నారాయణఖేడ్ సబ్ కలె క్టర్ ఉమా హారతి, ఐఏఎస్ ఆధ్వర్యంలో ని ర్వహించిన ప్రజావాణి కార్యక్రమం విజయ వంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్ర జల నుండి మొత్తం 13 దరఖాస్తులను స్వీ కరించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ స్థా యి అధికారులు, మండల పరిషత్ అభివృ ద్ధి అధికారులు (ఎమ్ పి డి ఓ లు), తహసీ ల్దార్లు ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ స్ (రూరల్ వాటర్ సప్లై ), వ్యవసాయ, ఆరోగ్య వైద్య, విద్య, సివిల్ సప్లైస్, సోషల్ వెల్ఫేర్ తదిత ర శాఖల అధికారులు పాల్గొని, ప్రజల నుం డిస్వీకరించబడినవినతులనుపరిశీలించా రు.సంబంధిత శాఖలఅధికారులుస్వీకరిం చిన వినతులపైతక్షణ చర్యలుతీసుకోవా లని సబ్ కలెక్టర్ఉమాహారతి ఆదేశించారు.

## సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ




| క్రమ సంఖ్య | పంట | విక్రయ ధర ప్రతి కేజీకి (Sale Price per Kg) | సబ్సిడీ మొత్తం ప్రతి కేజీకి (Subsidy per Kg) | సబ్సిడీ తరువాత రైతు చెల్లించవలసిన ధర (After Subsidy) Rs./Kg | బ్యాగ్ ధర (రైతు ధర ప్రతి బ్యాగు) |
|---|---|---|---|---|---|
| 1 | Dhaincha (జీలుగ) | ₹163.50 | ₹81.75 | ₹81.75/kg | ₹2452.50 (30 kg bag) |
| 2 | Sunhemp (జనుము) | ₹155.50 | ₹77.75 | ₹77.75/kg | ₹3110.00 (40 kg bag) |

కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ మే 25/అక్షరం న్యూస్: రైతులకు సబ్సిడీపై జీలుగవిత్తనా లు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవ సాయ అధికారిని శోభ సోమవారం ఒక ప్ర కటనలో తెలిపారు.30 కిలోల జీలుగు విత్త నాల బస్తా ధర 4905 ఉండగా 50 శాతం ప్రభుత్వ సబ్సిడీ పోగా రైతు 2452.50 చె ల్లించాలని అన్నారు.అవసరంఉన్నరైతులు తమ పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని రెండు న్నర ఎకరాలకు ఒక బస్తా చొప్పున పర్మిట్ల ను అందజేయడం జరుగుతుందని తెలి పారు. ఎల్లారెడ్డి గండిమాసానిపేట క్లస్టర్ రై తులకు మీసానిపల్లి రైతు వేదికలో పర్మిట్లు ఇవ్వడం జరుగుతుందని, జంగమయ్య ప ల్లి క్లస్టర్ రైతులకు బ్రాహ్మణపల్లి రైతు వేదిక లో, అన్నాసాగర్ క్లస్టర్ రైతులకు ఆజమా బాద్ రైతు వేదికలోపర్మిట్లు ఇవ్వడంజరు గుతుందని తెలిపారు. 26వ తేదీ ఉదయం 9:30 గంటల నుండి పర్మిట్లు ఇవ్వడంజరు గుతుందని,రైతులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రజావాణి లో 6 దరఖాస్తుల స్వీకరణ



కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/మే 25/అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి రెవిన్యూ డివిజన్ అధి కారి కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన ప్రజావాణిలో మొత్తం 6 దరఖాస్తు లనుస్వీకరించినట్లుఅధికారులుతెలిపారు. రెవెన్యూ శాఖ కు సంబంధించిన4 దరఖా స్తులు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధిం చిన2 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎల్లారెడ్డి ఆర్ డి ఓ ఆర్ ప్రభాకర్ కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా వాణికార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్ళగా, కార్యాలయ సిబ్బంది దరఖాస్తులను స్వీక రించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖా ధికారులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- **మునిసిపల్ చైర్మన్: పద్మ శ్రీకాంత్**



కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/మే 25/అక్షరం న్యూస్: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణా ళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మె ప్మా ఆధ్వర్యంలో పట్టణ సర్వసభ్య సమై క్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా ఆయనహాజర య్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రా ష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వాలంబనే లక్ష్యంగా రాష్ట్ర మహిళలకు,అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తూ, వారిని ఆర్థికంగా బలోపే తం చేయడానికి కృషి చేస్తుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ సహకారం తో మహిళా సంఘాలకు వడ్డీలేనీ రుణాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ఇండ్ల నిర్మా ణానికి అదనంగా రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయంఅందజేయడంజరుగుతుం దని తెలిపారు. అనంతరం మునిసిపల్ చై ర్మన్ పద్మ శ్రీకాంత్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది మహిళా సంఘాల నాయకురాలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 138 దరఖాస్తులు

- **జిల్లా కలెక్టర్: ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి జిల్లా/కామారెడ్డి:ఎల్లారెడ్డి/మే 26/అక్షరం న్యూస్: ప్రతి సోమవారం కా మారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ని ర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన 138 దర ఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ప్రజలు తమ సమ స్యలను నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తెచ్చి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలనుసత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అందిన దరఖాస్తులను సం బంధిత శాఖల అధికారులకు చేరవేస్తూ స మస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేప ట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.విగిరి, బాన్సువాడ ఆర్డిఓ, ఎల్లారెడ్డి ఆర్ డి ఓ ఆ ర్. ప్రభాకర్ జిల్లా పరిషత్ సీఈఓ చందర్ తదితరులు పాల్గొన్నారు.

## నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్ 'కరస్వామి' అనే లోకల్ దొంగ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. సినిమా థియేటర్లలో విడుదలైనప్పుడు మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. ధనుష్ నటన, యాక్షన్ సన్నివేశాలు మంచి ప్రశంసలు అందుకున్నాయి.

## కేన్ ఫెస్టివల్‌లో మెరిసిన ఐశ్వర్య



### ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన కంగనా


ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ తన ఫ్యాషన్ లుక్‌తో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మెరిశారు. తన కుమార్తె ఆరాధ్యతో కలిసి రెడ్ కార్పెట్‌పై యలొలికించారు. అయితే, ఐశ్వర్య లుక్‌పై నెట్టింట కొన్ని విమర్శలు ఎదురవుతున్నాయి. వీటిపై ఐష్ స్పందిం చనప్పటికీ.. నటి కంగనా రనౌత్ ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఐశ్వర్య ఫొటోను తన ఇన్‌స్టాలో షేర్ చేసిన కంగన అద్భుతంగా ఉన్నారని ప్రశంసించారు. 'ఫ్యాషన్, స్టైల్ అనేది ఎవరికి నచ్చినట్లు వారు ఎంపిక చేసుకునేవి. వారి ఇష్టానికి, సౌకర్యానికి తగినట్లు ఉంటాయి. ఈ విషయంలో ఏ మహిళ కూడా ఎవరికీ ఎటువంటి వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు. కేన్స్‌లో ఐశ్వర్య అద్భుతంగా ఉన్నారు. ఆమెను మరేదైనా స్టైల్‌లో చూడాలనుకునే వారు మొదట మీ దగ్గర ఏముందో ప్రపంచానికి చూపించవచ్చు కదా?.. అయినా.. రెడ్‌కార్పెట్‌పై ఎప్పుడూ యువ నటీమణులే ఉండరు. ఇలా 50 ఏళ్లలో ఉన్నవారు కూడా మెరుస్తారు. వారిని చూడడం మీకు అలవాటు లేకపోతే ఇకనైనా అలవాటు చేసుకోండని తన పోస్ట్‌లో కంగనా రాసుకొచ్చారు. ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో మే 12 నుంచి 23 వరకూ సందడిగా జరిగింది. ప్రముఖ డిజైనర్ అమిత్ అగర్వాల్ ప్రత్యేకంగా రూపొందించిన 'లుమినారా' అనే డీప్ సెర్-బ్లూ గౌన్‌లో ఐశ్వర్య రెడ్ కార్పెట్‌పై నడిచి అందరినీ మంత్రముగ్ధుల్ని చేశారు. రెండోరోజు వైట్ డ్రెస్‌తో ఫొటోలకు పోజులిచ్చారు.

## రామాయణ్‌కు హన్స్ జిమ్మర్ సంగీతం అదనపు ఆకర్షణ

### రామాయణ విదేశీయులను కూడా ఆకర్శించడం ఖాయం


హిందీలో తెరకెక్కుతున్న ఇతిహాసం 'రామాయణ్'పై సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ అద్భుత కావ్యం ఇండియాకే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకుంటుందని ఏఆర్ రెహమాన్ అన్నారు. దాదాపు 4000 కోట్ల బ్జడెట్‌తో నమిత్ మల్హోత్ర ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ గొప్ప ఇతిహాసం గురించి ప్రపంచానికి తెలియాలన్నదే నిర్మాతగా ఆయన ఆకాంక్ష. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్‌తోపాటు హాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ కూడా పని చేస్తున్నారు. ఆయనతో కలిసి పనిచేయడం గురించి తాజా ఇంటర్వ్యూలో రెహమాన్ మాట్లాడారు. 'సంగీత ప్రపంచంలో ఆయనది విభిన్నమైన శైలి. మాది గొప్ప స్నేహం. మన దేశానికి, సంస్కృతికి సంబంధించిన గొప్ప చిత్రానికి మేమిద్దరం కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది.

# లక్కీ ఛార్మ్ త్రిష



### ముగ్గరు హీరోలకు బ్లాక్ బస్టర్లు

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా కోలీవుడ్ స్టార్ హీరోల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె భాగం కావడం ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో 'త్రిష లక్కీ ఛార్మ్' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయింది. ప్రముఖ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ.. 'వారి బ్లాక్‌బస్టర్ విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది' అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రస్తుత తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో త్రిష నటించిన 'లియో' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం 2023లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విజయ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ రూపొందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్రలో నటించింది. ఈ సినిమా రూ.248 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అజిత్ కెరీర్‌లో బి÷-గగెస్ట్ హిట్‌గా నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య.. 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') సినిమాతో మళ్లీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు సినిమాల్లో కూడా త్రిష హీరోయిన్‌గా కనిపించడంతో.. అభిమానులు ఆమెను 'లక్కీ ఛార్మ్' అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు వశిష్ట మల్లిడి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె అవని పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాపై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.





## అర్జున్ టెండూల్కర్‌ను చూసి ఎమోషనల్ అయిన సారా!




సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కుమారుడు, యువ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్జున్ టెండూల్కర్ ప్రస్తుత ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు తరపున బరిలోకి దిగాడు. లక్నో హోమ్ గ్రౌండ్ అయిన ఏకనా స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా ఆయన ఈ సీజన్‌లో తన మొదటి మ్యాచ్ ఆడాడు. తన అరంగేట్రం మ్యాచ్‌లోనే ఆకట్టుకునే ప్రదర్శన చేసిన అర్జున్‌పై ఆయన తండ్రి సచిన్ టెండూల్కర్, సోదరి సారా టెండూల్కర్ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగంతో కూడిన ప్రశంసల జల్లు కురిపించారు. భారీ స్కోర్లు నమోదైన ఈ ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లో అర్జున్ టెండూల్కర్ తన నాలుగు ఓవర్ల కోటాలో 36 పరుగులు ఇచ్చి 1 వికెట్ పడగొట్టాడు. పంజాబ్ కింగ్స్ పరుగుల వేగానికి అడ్డుకట్ట వేస్తూ, ప్రమాదకరంగా మారుతున్న ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌ను ఒక పదునైన యార్కర్‌తో హడలెత్తించాడు. చివరకు ఎల్బీగా అవుట్ చేశాడు. ఈ క్రమంలో ఐపీఎల్ 2026లో తొలి వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. తన తమ్ముడు అర్జున్ సాధించిన ఈ విజయాన్ని చూసి సోదరి సారా టెండూల్కర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అర్జున్ ఫోటోలను పంచుకుంటూ ఒక హృదయపూర్వక నోట్ రాశారు. "నువ్వు ఈ ప్రపంచంలోని అత్యుత్తమ విజయాలన్నింటికీ అర్హుడివి నా బుజ్జి తమ్ముడా. నీ కఠిన శ్రమ, ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొనే నీ సామర్థ్యం, మరియు వీటన్నింటి మధ్య నువ్వు ప్రదర్శించిన ఓర్పును చూస్తుంటే నాకు చాలా చాలా గర్వంగా ఉంది. నిన్ను ఎప్పటికీ ఇలాగే ప్రేమిస్తూనే ఉంటాను" అంటూ సారా టెండూల్కర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో రాసుకొచ్చారు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఈ సీజన్ లీగ్ దశలో ఆడుతున్న చివరి మ్యాచ్ వరకు అర్జున్ టెండూల్కర్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో అవకాశం రాలేదు. అయినప్పటికీ పట్టుదలతో ఎదురుచూసిన కొడుకు ఓర్పును తండ్రి సచిన్ టెండూల్కర్ ప్రత్యేకంగా అభినందించారు. "వెల్ డన్ అర్జున్. ఈ సీజన్ పొడవునా నువ్వు నిన్ను మలుచుకున్న విధానం చూసి గర్విస్తున్నాను. ఎల్లప్పుడూ నీ సామర్థ్యాన్ని నువ్వు నమ్మావు. ఈ సీజన్ చివరి మ్యాచ్ వరకు నీకు అవకాశం రాకపోయినప్పటికీ ఎంతో ఓపికగా ఉంటూ, నిశ్శబ్దంగా నీ పని నువ్వు చేసుకుంటూ, సానుకూల దృక్పథంతో నిలిచావు. క్రికెట్ అనేది ఆటగాడి నైపుణ్యాన్ని ఎంతగా పరీక్షిస్తుందో, అంతకంటే ఎక్కువగా అతడి ఓర్పును కూడా పరీక్షిస్తుంది. ఈ రోజు నువ్వు ఈ రెండింటినీ చాలా అందంగా హ్యాండిల్ చేశావు. నీ కాళ్లు ఎప్పుడూ నేలపైనే ఉండేలా (వినమ్రంగా) చూసుకో, ఈ ఆటను నువ్వు ఎప్పుడూ ప్రేమించినట్లే ఇకముందు కూడా ప్రేమిస్తూ ముందుకు సాగు" అని సచిన్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.

## చరిత్ర సృష్టించిన నొవాక్ జకోవిచ్

### ఫ్రెంచ్ ఓపెన్‌లో నొవాక్ జకోవిచ్ శుభారంభం

సెర్బియన్ టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. అతడు మాజీ టెన్నిస్ ప్లేయర్ రోజర్ ఫెదరర్ ఆల్?టైమ్ రికార్డ్?ను బ్రేక్ చేశాడు. ప్రస్తుతం రోలాండ్ గారోస్ (ఫ్రెంచ్ ఓపెన్?) 2026లో ఆడుతున్నాడు. అయితే ఈ టోర్నీలో తొలి మ్యాచ్?లో బరిలోకి దిగడంతోనే నొవాక్? తన కెరీర్?లో అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. మే 24న ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమైంది. ఈ టోర్నీలో తొలి రోజే నొవాక్ తన మొదటి పోరులో ఫ్రెంచ్ ఆటగాడు గియోవన్నీ మ్పెట్షి పెరికార్డ్‌ను ఢీ కొట్టాడు. అయితే ఈ మ్యాచ్?లో అతడు గ్రౌండ్?లోకి దిగడంతోనే రికార్డు సాధించాడు. గ్రాండ్ స్లామ్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో 'మెయిన్ డ్రా'లో అత్యధికసార్లు పాల్గొన్న ఆటగాడిగా నొవాక్ తన పేరును రికార్డుల్లోకెక్కించుకున్నాడు. ఒక గ్రాండ్?స్లామ్ టోర్నమెంట్‌లో పాల్గొనడం నొవాక్?కు ఇది 82వ సారి. ఇందులో రౌండ్ ఆఫ్ 128, రౌండ్ ఆఫ్ 64, రౌండ్ ఆఫ్ 32, రౌండ్ ఆఫ్ 16, క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్? ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈ సెర్బియన్ స్టార్ రోజర్ ఫెదరర్ రికార్డును బ్రేక్ చేశాడు. ఫెదరర్ తన కెరీర్?లో 81 'మెయిన్ డ్రా' మ్యాచ్‌లు ఆడాడు. సుదీర్ఘ కెరీర్?లో నొవాక్ ఫ్రెంచ్ ఓపెన్?లో పాల్గొనడం ఇది 22వ సారి. దీంతో ఫ్రెంచ్ ఓపెన్?లో అత్యధిక సార్లు పాల్గొన్న ఆటగాడిగానూ నిలిచాడు. ప్రస్తుతం ఫ్రెంచ్ స్టార్ రిచర్డ్ గాస్కెట్ (22సార్లు)తో సమానంగా నొవాక్ సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఇక అతడు ఇప్పటిదాకా మూడుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గాడు. గతంలో 2016, 2021, 2023లలో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్?ను జకోవిచ్ కైవసం చేసుకున్నాడు. ఇప్పుడు నాలుగో టైటిల్ సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగాడు.కెరీర్?లో 22వసారి ఫ్రెంచ్ ఓపెన్?లో పాల్గొన్న నొవాక్ టోర్నీలో శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ మ్యాచ్?లో గియోవన్నీ మ్పెట్షి పెరికార్డ్‌పై 5-7, 7-5, 6-1, 6-4 తేడాతో విజయం సాధించాడు. అయితే మ్యాచ్?లో నొవాక్ మొదటి రౌండ్‌లో తన సెట్‌ను కోల్పోయాడు. ఆ తర్వాత నొవాక్ అద్భుతంగా పుంజుకున్నాడు. వరుసగా మూడు సెట్లలో నెగ్గి మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక రెండో మ్యాచ్?లో ఫ్రెంచ్ ప్లేయర్ వాలెంటైన్ రాయర్‌ను నొవాక్ ఎదుర్కోనున్నాడు. ఈ మ్యాచ్ బుధవారం (మే 27) జరగనుంది.

# ప్లేఆఫ్స్‌కు రంగం సిద్ధం..







ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ముంబై ఇండియన్స్‌పై రాజస్థాన్ రాయల్స్ 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో టాప్-4 లో నిలిచి చివరి ప్లేఆఫ్స్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్లతో తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, రాజస్థాన్ అద్భుత ప్రదర్శనతో ఆ రెండు జట్లను రేసు నుండి పూర్తిగా తప్పించింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ చేరిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లతో కలిసి రాజస్థాన్ రాయల్స్ నాకౌట్ దశకు చేరుకోవడంతో ఈ సీజన్ లీగ్ మ్యాచ్‌ల ఉత్కంఠ ముగిసింది.ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు జోఫ్రా ఆర్చర్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో కేవలం 15 బంతుల్లోనే 32 పరుగులు బాదడమే కాకుండా, బౌలింగ్‌లో 4 ఓవర్లలో 17 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 205 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ 175 పరుగులకే పరిమితమైంది. ముంబై బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ 60 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు.మే 26 తేదీన ధర్మశాల వేదికగా జరిగే క్వాలిఫైయర్-1 మ్యాచ్‌లో పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రెండో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఆ తర్వాత మే 27 తేదీన ముల్లాన్‌పూర్‌లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో మూడో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో నాలుగో స్థానంలో ఉన్న రాజస్థాన్ రాయల్స్ ఢీకొంటుంది. ఇందులో ఓడిన జట్టు టోర్నీ నుండి నిష్క్రమిస్తుంది.ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు, క్వాలిఫైయర్-1 లో ఓడిన జట్టుతో మే 29 తేదీన ముల్లాన్‌పూర్‌లోనే క్వాలిఫైయర్-2 మ్యాచ్ ఆడుతుంది. ఇందులో విజేతగా నిలిచిన జట్టు మే 31 తేదీన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే గ్రాండ్ ఫైనల్‌లో టైటిల్ కోసం పోరాడుతుంది. నిజానికి ఈ ఏడాది ఫైనల్ మ్యాచ్ బెంగళూరులో జరగాల్సి ఉన్నప్పటికీ, కొన్ని స్థానిక భద్రతా కారణాల వల్ల బీసీసీఐ ఈ వేదికను అహ్మదాబాద్‌కు మారుస్తూ గతంలోనే నిర్ణయం తీసుకుంది.

# పద్మశ్రీ పురస్కారంతో మెరిసిన హర్మన్‌ప్రీత్ కౌర్



భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం, మే 25, 2026న పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో, దేశ క్రికెట్‌కు ఆమె చేసిన విశేష కృషికి ఈ ఉన్నత గౌరవం దక్కింది. ఆమె నాయకత్వంలోనే గత నవంబర్‌లో భారత మహిళల జట్టు స్వదేశంలో ప్రపంచకప్‌ను గెలిచి చారిత్రక విజయాన్ని అందుకుంది. ఈ విజయంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించడానికి క్రీమ్ రంగు సంప్రదాయ దుస్తులలో హాజరైన ఆమె అందరి దృష్టిని ఆకర్షించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన మొదటి పౌర పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి రెండు పద్మ విభూషణ్‌లు, ఆరు పద్మ భూషణ్‌లు, 58 పద్మశ్రీ అవార్డులను అందించారు. 2026 సంవత్సరానికి మొత్తం 131 పద్మ పురస్కారాలకు కేంద్రం ఆమోదం లభించింది. వీటిలో ఐదు పద్మ విభూషణ్‌లు, 13 పద్మ భూషణ్‌లు, 113 పద్మశ్రీలు ఉన్నాయి. మిగిలిన గ్రహీతలను రెండో విడతలో సత్కరించనున్నారు.క్రీడా రంగం నుండి హర్మన్‌ప్రీత్ కౌర్ తో సహా పలువురు ప్రముఖులకు పద్మ పురస్కారాలు లభించాయి; భారత పురుషుల క్రికెట్ కెప్టెన్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ లభించినా హాజరు కాలేదు. టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్; బల్‌దేవ్ సింగ్, భగవాన్‌దాస్ రాయ్‌క్వార్, కె. పంజనీవేల్, ప్రవీణ్ కుమార్, సవితా పునియాకు పద్మశ్రీలను అందించారు .హర్మన్‌ప్రీత్ కౌర్ తన తరం అత్యంత డైనమిక్, ప్రభావవంతమైన క్రికెటర్లలో ఒకరిగా నిలిచారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609